# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 1-1-2023 RNI No.52865/93·Postal No\.H/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 108 పేజీలు:6 వెల: రూ.1/-


## ఆపదలో ఉన్నవారికి పోలీసులు ఉన్నారనే నమ్మకాన్ని కలిగించాలి-మాజీ డీజీపీ మహేందర్

హైదరాబాద్ డిసెంబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ ఏర్పడ్డాక శాంతిభద్రతల గురించి అపోహలున్నా..వాటిని అధిగమించి శాంతియుతంగా ముందుకెళ్తున్నామని డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు. పోలీస్ శాఖకు సీఎం కేసీఆర్ దిశా నిర్దేశం చేసి శాంతిభద్రతలకు పెద్దపీట వేశారని చెప్పారు. డీజీపీ మహేందర్ రెడ్డి పదవీకాలం నేటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమిలో పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీసు అధికారులు తనపై చూపిన ఆదరణకు ధన్యవాదాలు తెలిపారు. గత 36 ఏండ్లుగా పోలీస్ శాఖలో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. తదుపరి డీజీపీగా బాధ్యతలు చేపట్టనున్న అంజనీ కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఆయన నేతృత్వంలో పోలీస్ వ్యవస్థ మరింత ముందుకెళ్తుందని చెప్పారు.పోలీసు వ్యవస్థను ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చేశామని డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ అవసరాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించామని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందేలా ఎన్నో చర్యలు చేపట్టామని తెలిపారు. దీంతో ఆపదలో ఉన్నవారికి పోలీసులు ఉన్నారనే నమ్మకాన్ని పోలీస్ వ్యవస్థ ఇచ్చిందని వెల్లడించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ ఒక దేవాలయం లాందని చెప్పారు.

## తెలంగాణ డీజీపీగా అంజనీ కుమార్ బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, డిసెంబర్ 31తెలంగాణ నూతన డీజీపీగా అంజనీ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, సీపీలు సీవీ ఆనంద్, మహేశ్ భగవత్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజనీ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ ఉదయం తెలంగాణ స్టేట్ పోలీసు అకాడమిలో మహేందర్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే.

1992లో జనగామ ఏఎస్పీగా నియమితులైన అంజనీకుమార్ అంచెలంచెలుగా ఎదిగి డీజీపీ అయ్యారు. మహబూబ్‌నగర్ అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా, ప్రకాశం, గుంటూరు జిల్లాల ఎస్పీగా పనిచేశారు. 1998లో ఐక్యరాజ్యసమితికి డిప్యూటేషన్‌పై వెళ్లి బోస్నియాలో శాంతిదళాలతో కలిసి పనిచేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చి రెండు మెడళ్లు పొందారు. 2003 వరకు సీఐఎస్‌ఎఫ్‌లో పనిచేసి, అనంతరం రాష్ట్ర సర్వీసులకు వచ్చారు. 2005 నుంచి 2011 వరకు గుంటూరు, నిజామాబాద్ రేంజ్ డీఐజీగా, కౌంటర్ ఇంటెలిజెన్స్ డీఐజీగా, గ్రేహౌండ్స్ చీఫ్‌గా విధులు నిర్వర్తించారు. 2011-2012 మధ్యలో వరంగల్ ఐజీగా, 2012-2013 వరకు ఐజీ కమ్యూనికేషన్‌గా, 2018-2021 వరకు హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా, అనంతరం ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు.

### 2026లో పదవీ విరమణ

రాష్ట్ర డీజీపీగా నియమితులైన అంజనీకుమార్‌కు ప్రస్తుతం పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఐపీఎస్ అధికారుల్లో సీనియార్టీ జాబితాలో అంజనీకుమార్ ముందువరుసలో ఉన్నారు. 1966 జనవరి 28న బీహార్‌లో జన్మించిన అంజనీకుమార్.. పాట్నా సెయింట్ జేవియర్ స్కూల్‌లో ప్రాథమిక, ఉన్నత విద్య ను, ఢిల్లీ విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేశారు. ఐపీఎస్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు రెండు అవార్డులతోపాటు రాష్ట్రపతి పోలీసు మెడల్ అందుకొన్నారు. 2026 జనవరిలో పదవీవిరమణ చేయనున్నారు.

## కశ్మీర్ లోయలో తగ్గిన ఉగ్రవాదం.. 172 మంది ఉగ్రవాదుల హతం!

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: కశ్మీర్ లోయలో 2022లో 42 మంది విదేశీ ఉగ్రవాదులతోపాటు మొత్తం 172 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని జమ్ము కశ్మీర్ అదనపు డీజీపీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థల్లో యువత చేరికలు 37 శాతం తగ్గుముఖం పట్టాయని ట్వీట్ చేశారు. కశ్మీర్ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలు, భద్రతా బలగాల దాడులపై శనివారం ఆయన వరుస ట్వీట్లు చేశారు. కశ్మీర్‌లో భద్రతా బలగాలు 93 ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్స్ చేపట్టాయని తెలిపారు. భద్రతాదళాల ఎదురుకాల్పుల్లో మరణించిన ఉగ్రవాదుల్లో 108 మంది లష్కర్-ఏ-తొయిబా, 35 మంది జైషే మహమ్మద్, 22 మంది హిజ్బుల్ ముజాహిద్దీన్, నలుగురు ఆల్ బాద్ర్, ముగ్గురు అన్సార్ గజ్వాత్ ఉల్ హింద్ ఉగ్రవాదులు ఉన్నారు.

భద్రతాదళాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురు కాల్పులు, ఉగ్రవాద దాడుల్లో 14 మంది జమ్ముకశ్మీర్ పోలీసులతోపాటు 26 మంది భద్రతా దళాల జవాన్లు ప్రాణాలు కోల్పోయారని విజయ్‌కుమార్ తెలిపారు. ఉగ్రదాడుల్లో 29 మంది పౌరులు మృతి చెందారన్నారు. ఈ ఏడాది కొత్తగా 100 మంది ఉగ్రవాద సంస్థల్లో చేరారని, గతేడాదితో పోలిస్తే ఇది 37 శాతం తక్కువ అన్నారు. వారిలో 74 మంది లష్కరే తొయిబాలో చేరారని వెల్లడించారు. కొత్తగా ఉగ్రవాద సంస్థల్లో చేరిన వారిలో 65 మంది ఎన్‌కౌంటర్లలో హతం అయ్యారని తెలిపారు.

17 మంది ఉగ్రవాదులు అరెస్ట్ కాగా, 18 మంది కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని విజయ్ కుమార్ చెప్పారు. ఎన్‌కౌంటర్లలో మరణించిన ఉగ్రవాదుల నుంచి 121 ఏకే సిరీస్ రైఫిళ్లతోపాటు ఎనిమిది ఎం4 కార్బైన్, 231 పిస్టళ్లతోపాటు మొత్తం 360 ఆయుధాలు జప్తు చేశామన్నారు.

## మాజీ పోప్ బెనెడిక్ట్ అస్తమయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:క్యాథలిక్ మతాధిపతి, మాజీ పోప్ బెనెడిక్ట్ (95) పరమపదించారు. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బెనెడిక్ట్.. హృద్రోగ, ఇతర వ్యాధులకు చికిత్స తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరారు. ఆరోగ్యం క్షీణించడంతో శనివారం ఉదయం 9: 34గంటల సమయంలో ప్రాణాలు వదిలినట్లు వాటికన్ ప్రతినిధులు వెల్లడించారు.క్యాథలిక్ మతాధిపతిగా వ్యవహరించిన బెనెడిక్ట్ చీఎవి 2013లో వృద్ధాప్య కారణాలతో పోప్ పదవికి రాజీనామా చేసి కేథలిక్ క్రైస్తవులనుగ్ర్భ్రాంతికి గురి చేశారు. ఆరోగ్యం క్షీణించడం వల్ల పోప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు అప్పట్లో బెనెడిక్ట్ ప్రకటించాడు. దాదాపు 600 ఏండ్లలో పోప్ పదవి నుంచి ఇలా అర్ధాంతరంగా వైదొలగడం ఇదే తొలిసారి. ఈయన కంటే ముందు 1415లో క్రైస్తవుల రెండు గ్రూపుల మధ్య ఘర్షణల కారణంగా గ్రెగొరీ చీఎవి రాజీనామా చేశాడు.

### చరిత్రలో నేటినిజం



కం॥ అంపా చారముగా-నను
కంపా పరుడై యుభవృడు కామన నిడచున్
సొంపుగ లోటుబి దిద్దుఢ
నింటిలమగు "రెండు వేల ఇరువది మూడు"నే!!

(జనవరి 1 నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు..)

-రాధశ్రీ

సెల్:9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## ప్రశంసాల స్ఫూర్తితో పంచాయతీరాజ్ అధికారులు పనిచేయాలి : మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్, డిసెంబర్ 31రాష్ట్రంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది మెరుగ్గా పనిచేయడం వల్ల తెలంగాణకు జాతీయస్థాయిలో అవార్డులు వచ్చాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీపీవోలు, మండల పంచాయతీ అధికారులు, డీఆర్డీవోల తో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో పంచాయతీ రోడ్లు అద్దంలా ఉండాలి. వర్షాకాలంలో మొదటి వర్షం పడేటప్పటికీ ఏ ఒక్క రోడ్డు మీద గుంత కనిపించవద్దు. దెబ్బతిన్న రోడ్లన్ని బాగు కావాల'ని ఆదేశించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన రూ. 1100 కోట్లు విడుదల చేయక పోవడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని అధికారులు, సర్పంచులు అర్థం చేసుకోవాలని సూచించారు. కేంద్రం ఇస్తున్న గ్రాంట్‌కు సమానంగా గ్రాంట్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణనే అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక పంచాయతీలకు 8 ఏళ్లలో వచ్చిన నిధులు అంతకుముందు 50 ఏళ్లలో కూడా రాలేదన్నారు. ప్రభుత్వ పథకాల వివరాలను ప్రతి పంచాయతీలో బోర్డులు చేసి పెట్టించాలని వెల్లడించారు. గ్రామ పంచాయతీ భవనాలకు ఇటీవల మంజూరు చేసిన 3686 భవనాల నిర్మాణం వేగవంతం చేయాలని ఆదేశించారు.పతి నియోజకవర్గానికి రూ. 5 కోట్లతో రోడ్ల ప్రతిపాదనలు ఇవ్వాలన్న జాబితా వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్సులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యదర్శి సందీప్ సుల్తానియా, ఇంజినీర్ ఇన్ చీఫ్ సంజీవ రావు, కమిషనర్ హనుమంతరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తల్లి జన్మనిస్తే.. పునర్జన్మ ఇచ్చేది డాక్టర్ : మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబర్ 31 వైద్య వృత్తి చాలా గొప్పది.. తల్లి జన్మనిస్తే.. పునర్జన్మ ఇచ్చే అవకాశం డాక్టర్‌కు మాత్రమే ఉంటుంది అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. డబ్బుతో ఏ వస్తువునైనా కొనగలుగుతారు. కానీ డబ్బుతో ప్రాణాన్ని కొనలేరు. ఆ ప్రాణాన్ని పోసే శక్తి వైద్యులకు మాత్రమే ఉంటుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా నియామకమైన డాక్టర్లకు నియామక పత్రాలను మంత్రి హరీశ్‌రావు అందజేశారు. హైటెక్ సిటీ శిల్పాకళా వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు ప్రసంగించారు. కొత్త సంవత్సరంలో కొత్త ఉద్యోగం, కొత్త జీవితం ప్రారంభించబోతున్న మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు. వైద్యులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ చరిత్రలో ఇన్ని ఉద్యోగాలు, పారదర్శకంగా చేపట్టడం ఇదే ప్రథమం అని అనుకుంటున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో పని చేయాలని, పేదలకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నాను. మీ తల్లిదండ్రులు, గురువులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని మంత్రి అన్నారు. పేదలకు సేవ చేసి గొప్ప డాక్టర్లుగా పేరు పొందాలని కోరుకుంటున్నాను.

చాలా మంది కరోనా సమయంలో కాంట్రాక్ట్ బేసిస్‌నా పని చేసిన వారు ఉన్నారు. ప్రాణాలకు తెగించి పని చేశారు. కరోనా సమయంలో కష్టపడ్డ డాక్టర్లకు రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌లో 20 మార్కులను వెయిటేజీ కింద ఇచ్చాం. దీంతో చాలా మందికి అవకాశాలు వచ్చాయన్నారు. 20 నుంచి 40 శాతం పీజీ సీట్లలో కూడా రిజర్వేషన్ కల్పించాం అని తెలిపారు. రేపట్నుంచి కొత్త ఉద్యోగాల్లో చేరితే బాగు ంటుంది. గ్రామాల ప్రజలు కూడా సంతోష పడుతారు. ప్రజలకు అందుబాటులో ఉండండి. పేదలకు సేవ చేయండి. మీ పీహెచ్‌సీ పరిధిలో ఉత్తమమైన సేవలు అందించండి. చేతులెత్తి దండం పెడుతున్నా.. ట్రాన్స్‌ఫర్లకు ఎవరూ తన వద్దకు రావొద్దు. కనీసం 2-3 ఏండ్లు ఇచ్చిన పోస్టింగ్‌లో పని చేయాలన్నారు. బాగా పని చేస్తే ట్రాన్స్‌ఫర్లకు సంబంధించిన కౌన్సెలింగ్‌లో వెయిటేజీ కల్పిస్తామని మంత్రి హరీశ్‌రావు సూచించారు.

## నాలాల సమగ్ర అభివృద్ధితో వరదముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం : మంత్రి తలసాని



హైదరాబాద్, డిసెంబర్ 31 హైదరాబాద్ నగరంలో నాలాల సమగ్ర అభివృద్ధి చేపట్టడం వల్ల వరదముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం సనత్ నగర్ నియోజకవర్గ పరిధి మినిస్టర్ రోడ్ లోని పికెట్ నాలా పై ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం క్రింద చేపట్టిన వంతెన పునర్నిర్మాణ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన నాలాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, నాలాలు ఆక్రమణలకు గురికావడంతో వర్షాకాలంలో పలు కాలనీలు వరద ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. పికెట్ నాలా వంతెన కూడా ప్రస్తుతం నీటి వరద ప్రవాహానికి అనుగుణంగా లేకపోవడం వలన వరద ముంపు సమస్య ఏర్పడుతుందని అన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసమే ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం క్రింద రూ. 20 కోట్లతో వంతెన పునర్నిర్మాణ పనులు, కళాసీగూడ నాలా విస్తరణ పనులను చేపట్టినట్లు వివరించారు.

పునర్నిర్మాణ పనులలో భాగంగా గతంలో 12 మీటర్లు ఉన్న వంతెనను 22 మీటర్ల వెడల్పు తో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 20 మీటర్ల వెడల్పుతో ఉన్న రోడ్డును 30 మీటర్లకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. వంతెన నిర్మాణం పూర్తయితే కంటోన్మెంట్, రసూల్ పురా బస్తీ, అన్నానగర్, బీహెచ్ఈఎల్‌కాలనీ, ఇక్రిశాట్ తదితర కాలనీల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. మంత్రి వెంట ఎస్ఎన్‌డీపీ సీఈ కిషన్, వాటర్ వర్క్స్ డైరెక్టర్ కృష్ణ, ఎస్ఈ భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముగ్గుల పోటి

హైదరానాద్ డిసెంబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );నిర్మల పరపతి సంఘం ఆద్వర్యం లో పాత సంవస్సురానికి వీడుకోలు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పలుకుతూ బాలాజీ నగర్ లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. నిర్మల పరపతి సంఘం అధ్యక్షురాలు నిర్మల అద్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమానికి హ్యూమన్ రైట్స్ ఆక్టివిస్ట్ లేడి మాహియా రాజ్,స్తానిక కార్పొరేటర్స్ లలితా యాదవ్,గొడుగు వేణు,బిసి ఐక్యవేదిక గ్రేటర్ ఐబిసి హైదరాబాద్ అధ్యక్షురాలు వాణి రెడ్డి, రత్న ప్రభ, సునీతా గౌడ్,తదితరులు హాజరైనారు. ఈ సందర్భంగా మాహియా రాజ్ మాట్లాడుతూ మహిళలందరూ రంగు రంగుల ముగ్గులతో కొత్త సంవస్సత్సరానికి స్వగతం పలుకడం అభినందనీయమన్నారు. ఈ రోజు లాగే రేపటి నుండి కొత్త సంవత్సరం లో ఆనందాలతో కలర్ ఫుల్ గా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటిలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

## సీఎం కేసీఆర్‌ను కలిసిన డీజీపీ అంజనీ కుమార్



హైదరాబాద్, డిసెంబర్ 31 ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను డీజీపీ అంజనీ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు డీజీపీగా అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు డీజీపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంజనీ కుమార్‌కు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ నూతన డీజీపీగా అంజనీ కుమార్ శనివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, సీపీలు సీవీ ఆనంద్, మహేశ్ భగవత్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజనీ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ ఉదయం తెలంగాణ స్టేట్ పోలీసు అకాడమిలో మహేందర్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే.

## ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సుభిక్ష పాలన : మంత్రి జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 31ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుభిక్ష పాలన అందించి కొత్త ఒరవడిని సృష్టించారని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిందే తడవుగా 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగానే ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు.

అదే స్ఫూర్తితో నూతన సంవత్సరంలోనూ సంక్షేమం,అభివృద్ధిని సమపాళ్లలో రంగరించి ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు నూతన సంవత్సరంలో తీసుకోబోయే నిర్ణయాలు వారి వారి అభ్యున్నతికి దోహదపడాలని ఆకాంక్షించారు.

## జనవరి 1 నుండి నుమాయిష్ ప్రారంభం

హైదరాబాద్ డిసెంబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) - 2023 ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. జనవరి ఒకటిన నుమాయిష్ ప్రారంభించనున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్విని మార్గం తెలిపారు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానం గాంధీ సెంటీనరీ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. నుమాయిష్‌లో సుమారు 2,400 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. గతేడాది నుమాయి?షను 14 లక్షల మంది సందర్శించారని, ఈసారి 20 లక్షలకు పైగా వస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 10.30 వరకు సందర్శకులకు అనుమతి ఉంటుందన్నారు. మధ్యాహ ?నం 2 గంటల వరకు రూ.600 ఫీజుతో మైదానంలోకి కార్లను అనుమతిస్తామన్నారు. ఎగ్జిబిషన్ ప్రవేశ రుసుం రూ.40గా నిర్ణయించినట్లు వివరించారు. మంత్రులు మహమూద్ అలీ, ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఒకటిన సాయంత్రం 5 గంటలకు ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో సొసైటీ సెక్రటరీ సాయినాథ్ దయాకర్ శాస్త్రి, జాయింట్ సెక్రటరీ వనం సురేందర్, పబ్లిక్‌సిటీ చైర్మన్ హరినాథ్ రెడ్డి, కన్వీనర్ ధీరజ్ జైశ్వాల్, కన్వీనర్ ఆదిత్య మార్గం, అశోక్ హైదర్ పాల్గొన్నారు.

## కొత్తగూడ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 31న్యూఇయర్ కానుకగా హైదరాబాద్ వాసులకు మరో నూతన ఫ్లై ఓవర్ అందుబాటులోకి రానుంది. కొత్తగూడ ఫ్లై ఓవర్‌ను మంత్రి కేటీఆర్ ఆదివారం ప్రారంభించనున్నారు. రూ. 263 కోట్ల వ్యయంతో 3 కిలోమీటర్ల మేర ఈ ఫ్లై ఓవర్‌ను నిర్మించారు. కొత్తగూడ ఫ్లై ఓవర్ ప్రారంభంతో కొండాపూర్, గచ్చిబౌలి వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

మూడు కిలోమీటర్ల పొడవుతో చేపట్టిన ఈ ఫ్లై ఓవర్‌కు అనుబంధంగా 470 మీటర్ల పొడవుతో 11 మీటర్ల వెడల్పుతో అండర్ పాస్‌ను కూడా చేపట్టి అధికారులు పూర్తి చేశారు. ఇందులో 65 మీటర్ల పొడవుతో క్లోజ్డ్ బాక్స్ 425 మీటర్ల ఓపెన్ బాక్స్ గల అండర్ పాస్ చేపట్టారు. కాగా కొత్తగూడ ఫ్లై ఓవర్ వల్ల గచ్చిబౌలి, కొండాపూర్ వాసులు ప్రయోజనం పొందుతారు. గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి హైటెక్ సిటీ వరకు కనెక్టివిటీతో పాటు పరిసర ప్రాంతాలను కలుపుతుంది. ఈ వంతెన వల్ల బొటానికల్ గార్డెన్, కొత్తగూడ జంక్షన్‌లలో 100 శాతం ట్రాఫిక్ సమస్య పరిషారం అవడమే కాకుండా కొండాపూర్ జంక్షన్‌లో 65 శాతం ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

## న్యూ ఇయర్ వేడుకలపై నిఘా కన్ను.. 18వేల మంది మోహరింపు..!

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు నిఘా పెట్టారు. నగరంలో భద్రత కల్పించేందుకు 18వేల బలగాలను మోహరించినట్లు అధికారులు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలుంటాయని చెప్పారు. మేరకు నగరంలో 125 చోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గతేడాది నూతన సంవత్సరం సందర్భంగా 657 చలాన్‌లు జారీ చేయగా, అందులో 36 మంది మద్యం తాగి వాహనాలు నడిపినందుకు సంబంధించినవని ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు.

శనివారం రాత్రి 8 గంటల నుంచి కన్నాట్ ప్లేస్‌లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, మద్యం తాగి వాహనాలు నడిపే వారిని తనిఖీ చేసేందుకు ఆల్కోమీటర్‌లను ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) దేవేంద్ర పాఠక్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరం సందర్భంగా భద్రత ఏర్పాట్లను చేసినట్లు పేర్కొన్నారు. శనివారం నగరవ్యాప్తంగా 16,500 మంది సిబ్బందిని పోలీసు బలగాలను, మరో 20కిపైగా కంపెనీలను మోహరించనున్నట్లు వివరించారు. మహిళా భద్రతపై పోలీసుల దృష్టి కేంద్రీకరిస్తామని, నగరంలో 2,500 మందికి పైగా మహిళా సిబ్బందిని మోహరిస్తామని పాఠక్ చెప్పారు.

తనిఖీల కోసం 1,600 పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 1,200 మొబైల్ పెట్రోలింగ్ వాహనాలు, 2,074 మోటార్‌బైక్‌లు బలగాలు ఉంటాయని వివరించారు. స్పెషల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) ఎస్ఎస్ యాదవ్ మాట్లాడుతూ జాయింట్ చెకింగ్ కోసం స్థానిక పోలీసు సిబ్బందితో పాటు ట్రాఫిక్ పోలీసుల నుంచి దాదాపు 1,850 మంది సిబ్బందిని మోహరించనున్నట్లు వివరించారు.

# విజ్ఞాన వినోద వితరణశీలిగా టీవీ

విశ్వ మానవాళి గత సాంప్రదాయాలను, వర్తమాన పోకడలను, భవిష్యత్ నవ్య (అ)నాగరిక జీవనసరళిని స్పష్టతతో కళ్లకు కట్టినట్లు చూపగల ఆధునిక శాస్త్రసాంకేతిక దృశ్య శ్రవణ విప్లవ ఫలితమే దూరదర్శని లేదా టెలివిజన్ లేదా టీవీ అనబడే ఎలక్ట్రానిక్స్ ఉపకరణ ఆవిష్కరణ. 1927లో 21 ఏండ్ల 'ఫిలో టేయిలర్ ఫార్న్స్‌వర్థ్' అనే యువకుడు మె?దటి ఎలక్ట్రానిక్ టీవీని కనుగొన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా 90 శాతం గృహాలకు టీవీల సౌకర్యం ఉందని అంచనా. 2017లో 1.63 మిలియన్ల టీవీలు ఉండగా, 2023 వరకు వాటి సంఖ్య 1.74 మిలియన్లకు చేరవచ్చని ఊహిస్తున్నారు. ప్రతి ఇంటి డ్రాయింగ్ రూంలో టీవీ, చేతిలో చరవాణి స్మార్ట్ వైకుంఠం కనీస అవసరం అయినాయి. ఇవి మన జీవితాల్లో అనూహ్య వాంఛనీయ, అవాంఛనీయ పోకడలకు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు ధనిక వర్గం స్వంతమనుకున్న ఈ ఎలక్ట్రానిక్ ఉపకరణాలు నేడు అతి సామాన్యుడికి అందుబాటులోకి రావడం ఒక మంచి పరిణామమనే చెప్పాలి. రేడియో ప్రాచుర్యాన్ని తగ్గించిన టెలివిజన్‌తో అనేక ప్రయోజనాలతో పాటు దుష్ప్రభావాలు చోటు చేసుకుంటున్నాయి. బ్రిటన్‌లో సగటున ఒక్కొక్కరు రోజుకు కనీసం 4 గంటలు టివీ చూస్తుంటారని తేలింది. యూకే జనాభాను మించి టివీల సంఖ్య అధికంగా ఉండటం విశేషంగా చెప్పవచ్చు.

సమాజాభివృద్ధిలో టీవీ పాత్ర:

బహుముఖీన సమాజాభివృద్ధిలో టెలివిజన్ పాత్ర అనన్యసామాన్యం. ప్రపంచవ్యాప్తంగా సమాచారాన్ని క్షణాల్లో మన ఇంటికి చేర్చగల ఆధునిక ఉపకరణమే టెలివిజన్. మానవ జీవితంలోని అన్ని పార్శ్వాలను స్పృశించగల టెలివిజన్ చూడకుండా నేడు గంటైనా గడవడం లేదు. స్మార్ట్ ఫోన్‌లో ఎక్కడి నుంచైనా లైవ్‌లో టీవీలు వీక్షించడం అనేది నేటి యువతకు సాధారణ అలవాటుగా మారింది. మానవాళి మేధో సంపత్తి విస్తృతి, సమాచార వితరణ, విద్యాంశాలు, అంతర్జాతీయ అవగాహనలు, పర్యాటక స్థలాలు, విపత్తు, వాతావరణ హెచ్చరికలు, ఆరోగ్య సంరక్షణలు, అభిప్రాయ వినిమయాలు, వినోద కార్యక్రమాలు, సామాజిక అంశాలు, ప్రభుత్వ పథకాల వివరణలు, విశ్వవిషయ దర్శనాలు, సంఘటనల దృశ్యమాల లాంటి అనేక ఉపయోగాలను టీవీ కలిగి ఉంది. దృశ్య శ్రవణ మాధ్యమ వేదికగా టివి మన జీవితాలతో విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉంది. విజ్ఞాన, వినోద, క్రీడ, లోక పోకడలు, సంస్కృతీ సంప్రదాయాలు, రాజకీయ, ప్రేరణాత్మక ప్రసంగాలు, సామాజిక, విషయ పరిజ్ఞానం, వార్తలు, అపోహలు, విజ్ఞాన వితరణ, ప్రపంచీకరణ, విశ్వశాంతి స్థాపనకు, విభేధాల పరిష్కారాలు, జ్ఞాన వినిమయం, పరిశోధనాత్మక, సాధికారక, రుజువులు అవసరంలేని అన్ని అంశాలలో టీవీ ప్రసారాలు ముందుంటాయి. విశ్వ మానవాళితో టెలివిజన్ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఐరాస 1996 నుండి ప్రతియేటా 21 నవంబర్ రోజున "ప్రపంచ దూరదర్శన్ దినం" జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది.

ఈడియట్స్ బాక్స్‌గా టీవీ :

అంతర్జాల సదుపాయంతో స్మార్ట్ ఫోన్ వినియోగం తోడైన వేళ టెలివిజన్ పాత్ర పునర్ నిర్వచించబడింది. టెలివిజన్ అనే ఉపకరణం మానవాళికి ఉత్తమ వరంగా, మరో కోణంలో శాపంగా మారుతున్న అనుభవాలు మనకు కలుగుతున్నాయి. విచ్చలవిడి పోకడలు, హింసాత్మక దృశ్యాలు, వినియోగదారుల అనవసర ఆకర్షణలు, ప్రవర్తనలో విపరీత మార్పులు, సోమరితనం పెరగడం, నేర ప్రవృత్తి పెరగడం, విచిత్ర వేషధారణలు, చదవలేక పోవడం, వ్రాయలేక పోవడం, విష సంస్కృతులు, అశ్లీలతను వెదజల్లడం, అభ్యంతరకర భాషా ప్రయోగం, రాత్రుల్లో నిద్రలేమి, చానెల్స్ వ్యాపార ధోరిణి తీసుకోవడం, టిఆర్‌పీ రేట్ల ముసుగులో యాజమాన్యాలు నైతికత గీత దాటడాలు, చెడును ప్రేరేపించడాలు, లైంగిక అత్యాచారాలు, నవ్యత పేరుతో అనాగరిక చేష్టలు, వినోదం పేరుతో అసహ్యకర ఆటపాటలు, టివీ వీక్షణ దురలవాట్లు, ఉద్రేకాలు, మానసిక ఒత్తిడిలు, కంటి జబ్బులు, అనారోగ్యాలు, విద్యను వదిలి వెర్రి వినోదాల వెంట పడడాలు లాంటి అవలక్షణాలతో యువత చెడుపోకడలు భవిష్యత్తును ప్రమాదకరంగా మార్చుతున్నాయి. ఇలాంటి దుష్ప్రభావాలకు దారి తీస్తున్న టెలివిజన్‌ను 'ఇడీయట్స్ బాక్స్'గా పిలవడం కొన్ని సందర్భాలలో సందర్భోచితంగానే తోస్తున్నది.

విజ్ఞాన వినోదాల వితరణశీలిగా టీవీ:

టీవీలను మేధో వికాసానికి, విషయ పరిజ్ఞానానికి తెలివిగా వాడుకుంటూ, అవి ప్రచారం చేసే కార్యక్రమాలను విశ్లేషణ చేసుకుంటూ, మంచిని గ్రహించి చెడును త్యజించడం బాధ్యతగల పౌరుల కనీస కర్తవ్యంగా గుర్తించాలి. నేటి టీవీలు ఓటిటి వేదికలుగా మారి అనంత వినోదాలను పంచడానికి సిద్ధంగా ఉన్నది. సామాజిక మాధ్యమాలలో అత్యంత ప్రభావితం చేయగల సామర్థ్యంగల టెలివిజన్ వీక్షణను తెలివిగా చేసుకుంటూ, తెలివిని పెంచుకోవడం నేటి యువత కర్తవ్యం. టెలివిజన్ ఎలక్ట్రానిక్ ఉపకరణం ఇడియట్స్ బాక్స్ కాదని, నాలెడ్జ్ సోర్స్ బాక్స్ అని రుజువు చేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉన్నది.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## బ్రెజిల్‌కు చెందిన ఫుట్ బాల్ యశస్వి శ్రీ పెలే కన్నుమూత పట్ల సంతాపాన్ని వ్యక్తం చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:ఫుట్ బాల్ క్రీడ లో విశిష్టమైనటువంటి కీర్తి ని ఆర్జించిన వ్యక్తి, బ్రెజిల్ కు చెందిన శ్రీ పెలే కన్నుమూత పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీవ్ర దుఃఖాన్ని వ్యక్తం చేశారు. శ్రీ పెలే ఈ లోకాన్ని వీడిపోవడం క్రీడల జగతి లో భర్తీ చేయలేనంతటి శూన్యాన్ని మిగిల్చింది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

"శ్రీ పెలే కన్నుమూత క్రీడాప్రపంచం లో భర్తీ చేయలేనంతటి శూన్యాన్ని మిగిల్చింది. ప్రపంచ ఫుట్ బాల్ రంగం లో సూపర్ స్టార్ గా నిలచి శ్రీ పెలే సంపాదించుకొన్న ప్రజాదరణ ఎల్లలు ఎరుగనటువంటిది. ఆయన తన గొప్ప ఆట తీరు తోను, సాఫల్యాల తోను భావి తరాల వారి కి సైతం స్ఫూర్తి ని ప్రసాదిస్తూనే ఉంటారు. శ్రీ పెలే కుటుంబాని కి మరియు శ్రీ పెలే ను అభిమానించే వారి కి ఇదే నా సంతాపం. శ్రీ పెలే ఆత్మ కు ఆ ఈశ్వరుడు శాంతి ని ప్రసాదించు గాక." అని పేర్కొన్నారు.

## గనుల పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఎనిమిది ఇకో పార్కులను నిర్మించిన బొగ్గు రంగం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: పునరుద్ధరించిన భూమిపై ఇకో పార్క్‌లను అభివృద్ధి చేసేందుకు, గనుల పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు దేశంలోని భిన్న ప్రాంతాలలో ఎనిమిది ఇకో పార్క్‌లను నిర్మించగా, 2022-23 నాటికి మరో రెండు అటువంటి పార్కులను నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు.

కేంద్ర బొగ్గు, గనులు & పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి అక్టోబర్ 2022న డబ్ల్యుసిఎల్ కు చెందిన ఝురే/ బాల గంగాధర్ తిలక్ ఇకో పార్క్‌ను ప్రారంభించారు. గనుల పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఎన్ఎల్‌సిఐఎల్ ఇటీవల పాండిచ్చేరి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (పిటిడిసి)తో అవగాహనా ఒప్పందం పై సంతకాలు చేయడమే కాక, గని ఎ & ఎఎలు స్థిరమైన మైనింగ్ కార్యకలాపాలను ప్రదర్శిస్తాయి.

సింగ్రౌలీ ఇకో టూరిజం సర్క్యూట్‌ను ప్రోత్సహించేందుకు ఎన్‌సిఎల్, మధ్య ప్రదేశ్ టూరిజం బోర్డు మధ్య అవగాహనా ఒప్పందం, మహారాష్ట్ర డైరెక్టొరేట్ ఆఫ్ టూరిజంతో విపిఓలతో చేసుకున్న ఒప్పందం బొగ్గు రంగంలో ఇకో టూరిజంను మరింత ప్రోత్సహించనున్నాయి.

సుస్థిర అభివృద్ధి, హరితీకరణ కార్యక్రమాలకు అనుగుణంగా బొగ్గు/ లిగ్నైట్ పిఎస్‌యులుఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు 2300 హెక్టార్ల భూమిలో సుమారు47 లక్షల మొక్కలను నాటారు.

## వైకుంఠ ఏకాదశికి భద్రతపరమైన ఏర్పాట్లు.. క్యూలైన్లను పరిశీలించిన డీఐజీ



తిరుపతి, డిసెంబర్ 31:వైకుంఠ ఏకాదశికి భద్రతపరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని అనంతపురం రేంజ్ డీఐజీ రవి ప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన తిరుపతి నగరంలో 9 ప్రాంతాల్లో వైకుంఠ ఏకాదశికి టోకెన్‌ల జారీకి ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భక్తులు సహనం పాటించాలని, ప్రతి ఒక్క భక్తునికి దర్శనం చేసుకునే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం వారు వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారన్నారు.. ఏకాదశి. ద్వాదశి రోజుతో పాటు పది రోజులు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా అశేష భక్తి జనం సమూహాన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నగరంలో 9 ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక టోకన్లు జారీ చేయు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. క్యూ లైన్ లో తోపులాట జరగకుండా రద్దీని నియంత్రించడానికి తగిన పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

## భవాని దీక్షలు విజయవంతంగా పూర్తి చేసాం- ఇంద్రకీలాద్రి ఈఓ భ్రమరాంబ

అమరావతి: డిసెంబర్ 31:భవాని దీక్షలు విజయవంతంగా పూర్తి చేస్తామని ఇంద్రకీలాద్రి ఈఓ భ్రమరాంబ తెలిపారు. ఆమె మాట్లాడుతూ? ఇంద్రకీలాద్రి ఆదాయం పెరిగిందన్నారు. ఐదురోజులకు 7 కోట్ల 50 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఆరు లక్షలు ఖర్చు అయిందన్నారు. 5 లక్షల 40 వేల భవానీలు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. 15 లక్షల లడ్డూలు అమ్ముడయ్యాయన్నారు. వచ్చే ఏడాది దసరా, దీక్షలకు పర్మినెంట్ హోమ గుండాలు ఏర్పాటు చేస్తామన్నారు. మాస్టర్ ప్లాన్ లో భాగంగా వచ్చే ఉత్సవాలకు ముందస్తుగా కొన్ని పనులు పూర్తి చేస్తామన్నారు.

# హావ్ డా ను న్యూ జల్ పాయిగుడితో కలుపుతూ సాగే వందే భారత్ ఎక్స్ ప్రెస్‌కు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ప్రారంభం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:హావ్ డా ను న్యూ జల్ పాయిగుడి తో కలిపే వందే భారత్ ఎక్స్ ప్రెస్ కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న వీడియో కాన్ఫరెన్స్ మాధ్యం ద్వారా ప్రారంభ సూచక పచ్చజెండా ను చూపెట్టారు. పర్పుల్ లైన్ లో జోకా-ఎస్ ప్లేనేడ్ మెట్రో ప్రాజెక్టు అంతర్భాగం గా ఉన్నటువంటి జోకా-తారాతలా మార్గాన్ని కూడా ప్రధాన మంత్రి ప్రారంభించారు. నాలుగు రైల్ వే ప్రాజెక్టుల ను సైతం ఆయన దేశ ప్రజల కు అంకితం చేశారు. వాటిలో బోన్ చీ-శక్తిగఢ్ మూడో లైను, డాన్ కునీ-చందన్ పుర్ నాలుగో లైన్ ప్రాజెక్టు; నిమితియా- న్యూ ఫరక్కా డబల్ లైన్ మరియు అంబారీ ఫరక్కా-న్యూ మాయానగరీ- గుమానీహాట్ డబ్లింగ్ ప్రాజెక్టు లు ఉన్నాయి. న్యూ జల్ పాయిగుడి రైల్ వే స్టేశన్ పునర్ అభివృద్ధి పనుల కు కూడా ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఈ రోజు న వారి మధ్య కు రాలేకపోయినందుకు క్షమాపణ లు చెప్పారు. తనకు సంబంధించినంత వరకు ఈ రోజు పశ్చిమ బంగాల్ నేల కు ప్రణామాన్ని ఆచరించవలసినటువంటి రోజు అని, స్వాతంత్ర్య పోరాట చరిత్ర బంగాల్ లో అణువణువున నిండిపోయి ఉండటమే దీనికి కారణం అని ఆయన అన్నారు. "వందే మాతరమ్ నినాదం ప్రతిధ్వనించిన గడ్డ ఇవాళ వందే భారత్ ప్రారంభ సూచక పతాకాన్ని వీక్షిస్తున్నది" అని ప్రధాన మంత్రి అభివర్ణించారు. 1943వ సంవత్సరం డిసెంబర్ 30వ తేదీ నాడు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అండమాన్ మరియు నికోబార్ దీవుల లో మువ్వన్నెల జెండా ను ఎగురవేసి, తద్వారా భారతదేశం స్వాతంత్ర్య రథం తాలూకు చక్రాల ను నడిపించారన్నారు. ఈ చరిత్రాత్మకమైన దినం యొక్క 75వ వార్షికోత్సవం సందర్భం లో అండమాన్ ను సందర్శించే అవకాశం, మరి నేతాజీ గౌరవార్థం ఒక దీవి కి ఆయన పేరు ను పెట్టే భాగ్యం తనకు దక్కాయి అని ప్రధాన మంత్రి గుర్తుకు తీసుకు వచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగం గా 475 వందే భారత్ రైళ్ళ ను ఆరంభించాలి అని భారతదేశం ఒక సంకల్పాన్ని చెప్పుకొన్నది. ఈ రోజు న హావ్ డా నుండి న్యూ జల్ పాయిగుడి కి ప్రయాణం మొదలుపెట్టిన రైలు ఆ వందే భారత్ రైళ్ళ లో ఒకటి అని ఆయన వివరించారు. ఈ రోజు న ప్రారంభోత్సవం జరుపుకొంటున్నటువంటి అనేక ప్రాజెక్టు లను గురించి మరియు శంకుస్థాపన జరుపుకొంటున్నటువంటి వివిధ ప్రాజెక్టుల ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల ను పూర్తి చేయడానికి దాదాపు గా 5,000 కోట్ల రూపాయల ను వెచ్చిస్తోందన్నారు.

గంగ నది ని శుభ్రపరచడాని కి మరియు పశ్చిమ బంగాల్ కు తాగునీటి ని ఇవ్వడానికి సంబంధించిన అనేక ప్రాజెక్టుల ను దేశ ప్రజల కు ఈ రోజు న అంకితం చేసే అవకాశం తాను అందుకోబోతున్నట్లు కూడా ప్రధాన మంత్రి తెలియజేశారు. నమామి గంగే పథకం లో భాగం గా పశ్చిమ బంగాల్ లో 25 మురికినీటి సంబంధి ప్రాజెక్టుల ను ఆమోదించడమైంది అని ఆయన అన్నారు. వాటిలో 11 ప్రాజెక్టులు ఇప్పటికే నిర్మాణం ముగించుకొన్నాయి, మరో ఏడు ప్రాజెక్టుల పనుల ను ఈ రోజు తో ముగించడం జరుగుతోంది అని తెలిపారు. 1500 కోట్ల రూపాయల ఖర్చు తో 5 కొత్త పథకాల తాలూకు పనుల ను ఈ రోజు న మొదలు పెట్టడం జరుగుతోంది అని ఆయన అన్నారు. ఆది గంగ ప్రాజెక్టు వంటి ఒక ముఖ్యమైన ప్రాజెక్టు ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, ఈ ప్రాజెక్టు శుభ్రత నిమిత్తం 600 కోట్ల రూపాయల విలువైన మౌలిక సదుపాయాల ను సమకూర్చడం జరుగుతోంది అని వివరించారు. నది జలాల శుద్ధి తో పాటు, పెద్ద సంఖ్య లో ఆధునిక సీవేజి ట్రీట్ మెంట్ ప్లాంటుల ఏర్పాటు పై సైతం కేంద్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకొంటోంది అని ప్రధాన మంత్రి అన్నారు. రాబోయే 10-15 ఏళ్ళ అవసరాల ను దృష్టి లో పెట్టుకొని ఈ పని ని చేపట్టడం జరుగుతోంది అని ఆయన అన్నారు.

దేశం యొక్క అభివృద్ధి తో భారతీయ రైల్ వే ల సంస్కరణల కు మరియు భారతీయ రైల్ వే ల అభివృద్ధి పనుల కు లంకె ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ కారణం గానే, కేంద్ర ప్రభుత్వం ఆధునిక రైల్ వే సంబంధి మౌలిక సదుపాయాల కల్పన కై భారీ ఎత్తున పెట్టుబడుల ను పెడుతున్నది అని ఆయన వివరించారు. వందే భారత్, తేజస్ హమ్ సఫర్, ఇంకా విస్టాడోమ్ రైలు పెట్టె లు, న్యూ జల్ పాయిగుడి సహా పలు రైల్ వే స్టేశన్ ల ఆధునికీకరణ, రైల్ వే మార్గాల డబ్లింగ్, ఇంకా విద్యుతీకరణ లు ఈ ఆధునికీకరణ తాలూకు ఉదాహరణలు గా ఉన్నాయి ఆయన వివరించారు. ఈస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ మరియు వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ లు లాజిస్టిక్స్ రంగం లో విప్లవాత్మకమైన మార్పుల ను తీసుకు రాబోతున్నాయి అని కూడా ఆయన చెప్పారు. రైల్ వే భద్రత, పరిశుభ్రత, సమన్వయం, సామర్థ్యం, సమయ పాలన, ఇంకా సౌకర్యాల కల్పన ల వంటి రంగాల లో చోటు చేసుకొన్న పెను మార్పుల ను గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటించారు. గడచిన 8 సంవత్సరాల లో భారతీయ రైల్ వే లు ఆధునికత్వం తాలూకు పునాది విషయం లో శ్రమించాయి, మరి రాబోయే సంవత్సరాల లో భారతీయ రైల్ వే నవీనీకరణ తాలూకు ఒక కొత్త యాత్ర ను మొదలు పెట్టబోతోంది అని ప్రధాన మంత్రి స్పష్టంచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలి 70 సంవత్సరాల కాలం లో 20 వేల రూట్ కిలో మీటర్ రైలు మార్గాల ను విద్యుతీకరించడం జరిగింది అని ప్రధాన మంత్రి తెలియజేశారు. 2014వ సంవత్సరం నాటి నుండి చూస్తే 32 వేల రూట్ కి. మీ. కి పైగా రైలు మార్గాల ను విద్యుతీకరించడమైంది అని ఆయన అన్నారు. మెట్రో రైల్ సిస్టమ్ అనేది ప్రస్తుతం భారతదేశం యొక్క వేగాని కి మరియు స్థాయి కి ఒక ఉదాహరణ గా ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. "2014 వ సంవత్సరానికి పూర్వం 250 కి.మీ. కన్నా తక్కువ స్థాయి లోనే ఉన్నటువంటి మెట్రో నెట్ వర్క్ లో ఎక్కువ భాగం దిల్లీ-ఎన్ సిఆర్ పరిధి లో అమరింది. గత ఏడెనిమిది ఏళ్ళ లో మెట్రో రెండు డజన్ ల కు పైగా నగరాల కు విస్తరించింది. ప్రస్తుతం మెట్రో దాదాపు గా దేశం లో వేరు వేరు నగరాల లో 800 కి. మీ. మేరకు పరుగులు తీస్తోంది. మరో 1000 కి. మీ. కి పైచిలుకు మెట్రో మార్గాల లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి." అని ఆయన వెల్లడించారు.

గత కాలం లో భారతదేశం ఎదుర్కొన్న సవాళ్ళ ను గురించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ చెప్తూ, ఆ పరిణామం భారతదేశం యొక్క అభివృద్ధి మీద చాలా వరకు ప్రతికూల ప్రభావాన్ని కలగజేసింది అని పేర్కొన్నారు. ఒక ముఖ్య సవాలు ను గురించి ప్రధాన మంత్రి పేర్కొంటూ, దేశం లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రక్రియ లో భాగం పంచుకొన్న వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం లోపించిందని పేర్కొన్నారు. వివిధ రవాణా ఏజెన్సీల నడుమ సహకారం కొరవడడాన్ని గురించి కూడా ఆయన ప్రస్తావించారు. తత్ఫలితం గా ఇతర ఏజెన్సీ లు ఏమేమి పనులు చేస్తున్నదీ ప్రభుత్వ ఏజెన్సీ కి ఒక అవగాహన లేకుండా పోయింది అని ప్రధాన మంత్రి అన్నారు. "ఇది దేశం లోని నిజాయతీపరులైన పన్ను చెల్లింపుదారుల పైన ప్రత్యక్ష ప్రభావాన్ని ప్రసరింప చేసింది" అని ఆయన అన్నారు. వారు కష్టపడి సంపాదించిన డబ్బు ను పేద ప్రజల కు ఉపయోగించడానికి బదులు గా అవినీతిపరుల జేబుల ను నింపడానికి ఉపయోగించడం జరిగింది. దీనితో సహజం గానే అసంతృప్తి తల ఎత్తింది అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. "ఏజెన్సీ ల సమన్వయం లో అంతరాల ను భర్తీ చేయడం కోసం పిఎమ్ గతి శక్తి ప్లాను ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది" అని శ్రీ నరేంద్ర మోదీ చెప్పారు. "వేరు వేరు రాష్ట్ర ప్రభుత్వాలు కావచ్చు, నిర్మాణ సంస్థలు కావచ్చు, లేదా పరిశ్రమ నిపుణులు కావచ్చు.. ప్రతి ఒక్కరు గతి శక్తి ప్లాట్ ఫార్మ్ పైకి వచ్చి నిలబడుతున్నారు" అని ఆయన అన్నారు. పిఎమ్ గతి శక్తి అనేది దేశం లోని వేరు వేరు రవాణా మాధ్యాల కలబోత కు మాత్రమే పరిమితం కాదు. అది బహుళ విధ ప్రాజెక్టుల కు జోరు ను సైతం సంతరిస్తుంది అని ఆయన తెలిపారు. పౌరుల కు అంతరాయం ఉండనటువంటి విధం గా కనెక్టివిటీ ని అందించడం కోసమని కొత్త విమానాశ్రయాల ను, జలమార్గాల ను, నౌకాశ్రయాల ను మరియు రహదారుల ను నిర్మించడం జరుగుతున్నది అని ప్రధాన మంత్రి వివరించారు.

"21వ శతాబ్దం లోకి అడుగు పెట్టడాని కి దేశ ప్రజల శక్తియుక్తుల ను మనం సరిగ్గా ఉపయోగించుకొని తీరవలసిందే" అని ప్రధాన మంత్రి అన్నారు. దేశం లో జల మార్గాల ను గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రస్తావిస్తూ, పనులు జరుపుకోవడానికి, వ్యాపారాని కి, పర్యటన కు దేశం లోని జలమార్గాల ను పెద్ద ఎత్తున ఉపయోగించుకున్న కాలం అంటూ ఒకటి ఉండిందని, అయితే ఆ తరువాత బానిసత్వం లో దేశం మగ్గిపోయిన కాలం లో ఆ మార్గాల ను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. దేశం లో జల మార్గాల ను పునరుద్ధరించడం లో మునుపటి ప్రభుత్వాలు ప్రయత్న లోపాని కి ఒడిగట్టాయని కూడా ఆయన అన్నారు. "భారతదేశం ప్రస్తుతం తన జల శక్తి ని వృద్ధి చెందింప చేసుకొనే దిశ లో పాటుపడుతున్నది" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ప్రస్తుతం 100 కు పైగా జలమార్గాల ను అభివృద్ధి పరచడం జరుగుతోంది. వ్యాపారాని కి, పర్యటన కు ప్రోత్సాహాన్ని అందిస్తూ, నదుల లో అధునాతనమైన క్రూజ్ శిప్స్ ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు సాగుతున్నాయి అని ఆయన తెలిపారు. భారతదేశాని కి, బాంగ్లాదేశ్ కు మధ్య గంగ నది మరియు బ్రహ్మపుత్ర నదుల లో జల మార్గ సంబంధాల ను ఏర్పాటు చేయడం కోసం గంగ-బ్రహ్మపుత్ర ప్రాజెక్టు ను అభివృద్ధి చేయడం జరుగుతోంది అంటూ ప్రధాన మంత్రి ప్రస్తావించారు. 2023వ సంవత్సరం జనవరి 13వ తేదీ నాడు కాశీ నుండి బాంగ్లాదేశ్ మీదుగా డిబ్రూగఢ్ వరకు ఒక నౌక ప్రయాణం మొదలు పెట్టబోతోందని ఆయన చెప్తూ, 3200 కిమీ పొడవైన జలమార్గం లో సాగే ఈ తరహా యాత్ర యావత్తు ప్రపంచం లోనే మొట్టమొదటి సారి గా చోటు చేసుకొంటోంది. అంతేకాదు, ఇది దేశం లో క్రూజ్ టూరిజమ్ వృద్ధి చెందుతున్నది అనే అంశాన్ని చాటి చెప్పనుంది కూడాను అని ప్రధాన మంత్రి అన్నారు.

పశ్చిమ బంగాల్ లో ప్రజల కు మాతృభూమి పట్ల గల ప్రేమ ను గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా పేర్కొంటూ, భారతదేశం లో సాంస్కృతిక వారసత్వాని కి ప్రతీకలు గా ఉన్న వివిధ ప్రదేశాల ను సందర్శించడం అంటే వారు ఎక్కడలేని ఉత్సాహాన్ని కనబరుస్తూ ఉంటారు, మరి అటువంటి యాత్ర ల ద్వారా వారు అనేక విషయాలను తెలుసుకొంటూ ఉంటారు అని ప్రధాన మంత్రి అన్నారు. "బంగాల్ ప్రజలు 'దేశాని కే అగ్రతాంబూలం' అనేటటువంటి భావన కు పెద్ద పీట ను వేస్తారు, పర్యటన విషయం లో అయినా సరే వారు ఇదే విధమైన ప్రాధాన్యాన్ని కట్టబెడతారు" అని ఆయన వివరించారు. "దేశం లో కనెక్టివిటీ కి అందదండలు లభించాయి అంటే కనుక దేశం లో రైలు మార్గాలు, జల మార్గాలు, రాజ మార్గాలు మరింత ఆధునికం గా మారుతున్నాయంటే కనుక అటువంటి సందర్భాల లో ఒనగూరే ఫలితం ఏమిటి అంటే అది ప్రయాణించడం లో సౌలభ్యం లభించడమే కాక దాని ద్వారా బంగాల్ ప్రజానీకం సైతం లాభపడుతుంది మరి" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించే ముందు గురు శ్రీ రవీంద్రనాథ్ టాగోర్ పలుకుల ను కొన్నిటి ని ఉచ్చరించారు. ఆ మాటల కు "ఓ నా దేశ మృత్తికా, నీకు నేను శిరస్సు ను వంచి ప్రణామాన్ని ఆచరిస్తున్నాను" అనే అర్థం వస్తుంది. స్వాతంత్ర్యం తాలూకు ఈ అమృత కాలం లో ప్రతి ఒక్క వ్యక్తి మన మాతృభూమి కి అత్యంత ప్రాధాన్యాన్ని కట్టబెట్టే దిశ లో తప్పక పాటుపడాలి అని ప్రధాన మంత్రి అన్నారు. "యావత్తు ప్రపంచం భారతదేశానికేసి ఎంతో ఆశ తో, ఎన్నో ఆకాంక్షల తో చూస్తున్నది. దేశం లో ప్రతి ఒక్క పౌరుడు, ప్రతి ఒక్క పౌరురాలు వారి ని వారు దేశ సేవ కోసం సమర్పణం చేసుకు తీరాలి" అని చెప్తూ ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమం లో పశ్చిమ బంగాల్ ముఖ్యమంత్రి మమత బనర్జీ గారు, పశ్చిమ బంగాల్ గవర్నరు డాక్టర్ సి.వి. ఆనంద బోస్, రైల్ వే ల శాఖ కేంద్ర మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రులు శ్రీ జాన్ బార్ లా, డాక్టర్ సుభాష్ సర్ కార్ మరియు శ్రీ నిశీథ్ ప్రమాణిక్, ఇంకా పార్లమెంటు సభ్యుడు శ్రీ ప్రసూన్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ హావ్ డా రైల్ వే స్టేశన్ లో హావ్ డా ను న్యూ జల్ పాయిగుడి తో కలిపే వందే భారత్ ఎక్స్ ప్రెస్ కు ప్రారంభ సూచక ఆకుపచ్చటి జెండా ను చూపెట్టారు. ఈ అత్యధునాతనమైనటువంటి సెమి హై స్పీడ్ రైలుబండి లో ప్రయాణికుల కు అత్యాధునిక సదుపాయాల ను సమకూర్చడం జరిగింది. ఈ రైలుబండి రాక, పోక లు జరిపేటప్పుడు మార్గమధ్యం లో మాల్ దా టౌన్, బార్ సోయి మరియు కిశన్ గంజ్ స్టేశన్ లలో ఆగుతుంది. జోకా-ఎస్ ప్లేనేడ్ మెట్రో ప్రాజెక్టు (పర్పుల్ లైన్) లో భాగం గా ఉన్న జోకా-తారాతలా మార్గాన్ని ప్రధాన మంత్రి ప్రారంభించారు. 6.5 కిలో మీటర్ ల మేరకు ఏర్పాటు చేసిన ఈ మార్గం లో మొత్తం ఆరు స్టేశన్ లను 2475 కోట్ల రూపాయల కు పైగా ఖర్చు తో నిర్మించడం జరిగింది. ఆ ఆరు స్టేశన్ ల పేరు లు ఏవేవి అంటే అవి జోకా, ఠాకుర్ పుకుర్, సఖర్ బాజార్, బేహాలా చౌరస్తా, బేహాలా బాజార్ మరియు తారాతలా లు. ఈ ప్రాజెక్టు ప్రారంభం అయితే కోల్ కాతా నగరం లో దక్షిణ దిక్కున గల సర్ సునా, డాక్ ఘర్, ముచీపాడా లతో పాటుగా దక్షిణ 24 పరగణా ల ప్రయాణికుల కు చాలా మేలు కలుగుతుంది.

## మున్నూరుకాపు భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి.. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో తీర్మానం



హైదరాబాద్, డిసెంబర్ 31హైదరాబాద్ టూరిజం ప్లాజాలో జరిగిన సమావేశానికి కౌన్సిల్ ఛైర్మన్, మంత్రి కమలాకర్ అధ్యక్షత వహించగా, సంఘం గౌరవాధ్యక్షులు, ఎంపీ రవిచంద్ర, తదితర ప్రముఖులు హాజరయ్యారు. మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్రం అపెక్స్ కౌన్సిల్ (అత్యున్నత స్థాయి కమిటీ) సమావేశం హైదరాబాద్ నగరంలోని టూరిజం ప్లాజాలో శనివారం ఉదయం జరిగింది. కౌన్సిల్ ఛైర్మన్, మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన సుమారు మూడు గంటల పాటు జరిగింది.

ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, అధ్యక్షులు కొండా దేవయ్య, కన్వీనర్ బాలకిషన్ రావు, కౌన్సిల్ సభ్యులు సి.విఠల్, గాలి అనిల్ కుమార్, పూల రవీందర్, ఆకుల లలిత, మెట్టు శ్రీనివాస్, చల్లా హరిశంకర్, సర్దార్ పుట్టం పురుషోత్తం, ఎర్ర నాగేందర్, రౌతు కనకయ్య, తూడి ప్రవీణ్, ఊసా రఘు, మీసాల చంద్రయ్య, బుక్కా వేణుగోపాల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘాన్ని ఐకమత్యంతో మరింత ముందుకు తీసుకుపోయేందుకు, కోకాపేటలో ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల స్థలంలో మున్నూరుకాపు భవన నిర్మాణం పనులను వెంటనే చేపట్టి వేగవంతంగా పూర్తి చేసేందుకు గాను పలు తీర్మానాలు చేశారు.

## 10 పరీక్షల షెడ్యూల్ విడుదల.. నోటిఫికేషన్ జారీ చేసిన ఏపీఎస్ఎస్‌సీ బోర్డ్

అమరావతి: డిసెంబర్ 31: రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది ఏప్రియల్ 3 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నట్లు ఏపీఎస్ఎస్‌సీ బోర్డ్ ప్రకటించింది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఇవ్వాల (శుక్రవారం) పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ మీడియాకు విడుదల చేశారు. మొత్తం ఆరు సబ్జెక్టలకు పరీక్షలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సీబీఎస్ఈ తరహాలో రోజు విడిచి రోజు పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 3వ తేదీ ఫస్ట్ లాంగ్వేజ్, 6వ తేదీ సెకండ్ లాంగ్వేజ్, 8వ తేదీ ఇంగ్లీష్, 10వ తేదీ గణితం, 13వ తేదీ సైన్స్, 15వ తేదీ సోషల్ స్టడీస్ పరీక్షలను నిర్వహిస్తారు. అలాగే 17, 18వ తేదీల్లో ఒకేషనల్ కాంపోజిట్ కోర్సులకు సంబంధించిన ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షలతో పాటు థియరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్ఎస్‌సీ బోర్డ్ ప్రకటించింది. 17వ తేదీ కాంపోజిట్ కోర్సులకు సంబంధించి సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష, 18వ తేదీన ఒకేషనల్ కోర్సుకు సంబంధించి థియరీ పరీక్ష ఉంటుందని స్పష్టం చేసింది.

**9వ తేదీ వరకు ఫైన్‌తో దరఖాస్తులకు అవకాశం..**

10వ తరగతి పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువును కూడా ఎస్ఎస్‌సీ బోర్డ్ ప్రకటించింది. ఈ నెల 29 వరకు ఎలాంటి ఫైన్ లేకుండా పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉండగా ప్రస్తుతం ఆ గడువు ముగియడంతో వచ్చే నెల అంటే జనవరి 3వ తేదీ వరకు రూ. 200 ఫైన్‌తో అలాగే 9వ తేదీ వరకు రూ. 500 ఫైన్‌తో చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు 10వ తరగతి పరీక్షలకు సంబంధించి రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 6 లక్షల 60 వేల 859 విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లుగా వెల్లడించారు. మరోవైపు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు రూ. 125 కన్నా అధికంగా పరీక్ష ఫీజు వసూలు చేసినట్లుగా తమకు ఫిర్యాదులు అందాయని దీనిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బైక్, కారు రేసింగ్ నిర్వహిస్తే.. నాన్ బెయిలబుల్ కేసులు : ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి, డిసెంబర్ 31: తిరుపతిలో న్యూ ఇయర్ వేడుకలు చాలా ప్రశాంతంగా ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి వేడుకలకు ముగింపు పలకాలన్నారు. నగరంలో ప్రధాన కూడలిలో బ్రీత్ అనలైజర్ టెస్టులను చేయడం జరుగుతున్నదన్నారు. కళాశాల విద్యార్థులు మద్యం తాగి పట్టుపడితే తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు. కాలేజీ యాజమాన్లకు మందు తాగిన విద్యార్థుల లిస్టులను పంపడం జరుగుతుందని వివరించారు. తిరుపతిలో ఫ్లైఓవర్ రేపు సాయంత్రం నుంచి మూత వేయడం జరుగుతుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వాహనాలను కూడా సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రాణానికి ప్రమాదం తెచ్చుకోవద్దని ఎదుటివారి కూడా ప్రమాదం చేయవద్దని కోరారు. నూతన సంవత్సరం 2023 ప్రశాంతంగా, సంతోషంగా ఉండేలా గడపాలన్నారు. బార్లు ప్రభుత్వ మద్యం షాపులు గడువు లోపు మూయడం జరుగుతుందన్నారు. నగరంలో ఆరు హోటల్స్ లో ముందస్తుగా కల్చరల్ కార్యక్రమానికి అనుమతి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లా అండ్ ఆర్డర్ కులశేఖర్, క్రైమ్ అదరపు ఎస్పీ విమల కుమారి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సురేందర్ రెడ్డి. ఈస్ట్ డీఎస్పీ మురళీకృష్ణ. క్రైమ్ డీఎస్పీ సురేష్. దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ రామరాజు పాల్గొన్నారు.

## భారత సంతతి వ్యక్తికి నైట్‌హుడ్ అవార్డు.. పర్యావరణ పరిరక్షణ కృషికి గుర్తింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:బిటన్ మాజీ మంత్రి అలోక్ శర్మకు అరుదైన గౌరవం లభించనుంది. ఆయన బ్రిటన్ రాజు చేతుల మీదుగా నైట్‌హుడ్ అవార్డు అందుకోనున్నారు. కొత్త సంవత్సరం రోజున బ్రిటన్ రాజు చార్లెస్ 3 గౌరవించే వ్యక్తుల జాబితాలో భారత సంతతికి చెందిన ఈయనకు చోటు దక్కింది. పర్యావరణ పరిరక్షణ కోసం చేసిన కృషికి గుర్తింపుగా అలోక్‌కు ఈ గౌరవం దక్కింది. ఈ ఏడాది బ్రిటన్‌లో జరిగిన కాప్ 26 సదస్సుకు అలోక్ అధ్యక్షుడిగా ఉన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచ దేశాలతో బ్రిటన్ ఒక ఒప్పందానికి అంగీకరించడంలో అలోక్ కీలకంగా వ్యవహరించారు. ఇది నిజంగా గొప్ప ప్రభావం చూపనుంది అని బ్రిటన్ విదేశీ, కామన్‌వెల్త్, డెవలప్‌మెంట్ అధికారి ఒక ప్రకటనలో వెల్లడించారు. గ్లాస్గో నగరంలో ఈ ఏడాది అక్టోబర్ 31వ తేదీ నుంచి నవంబర్ 12 వరకు కాప్ 26 సదస్సు జరిగింది.

ప్రజా సేవలో విశిష్ట కృషి చేసిన 1,100 మందిని కొత్త ఏడాదిలో బ్రిటన్ రాజు గౌరవించనున్నారు. వీళ్లలో బ్రిటన్ మాజీ రాణి, దివంగత ఎలిజబెత్ 2 గిటారిస్ట్ బ్రయాన్ మే కూడా ఉన్నాడు. ఈ జాబితాలో ఉన్న విదేశాలకు చెందిన 30 మందిలో అలోక్ శర్మ ఒకరు. ఈ 30 మందిలో పర్యావరణ కార్యకర్తలు, విద్యావేత్తలు, ఆర్థిక నిపుణులు, వైద్యులు, సమాజ సేవకులు ఉన్నారు. అలోక్ శర్మ ఉత్తరప్రదేశ్‌లోని అగ్రాలో 1967 జన్మించారు. 5 ఏళ్ల తర్వాత ఆయన తల్లిదండ్రులు లండన్‌లోని రీడింగ్ నగరానికి వలస వెళ్లారు.

## పెన్షన్లు అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలలో కోతలు ఆపాలి

### –సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

అమరావతి డిసెంబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పెన్షన్లు అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలలో కోతలు ఆపాలని, జగనన్న ఇళ్ళ నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ పేదల పథకాల్లో కోత పెడుతూ.. జగన్ మోసం చేశారని, వయో వృద్ధులు, వితంతువులకు ఆసరా లేకుండా చేశారని విమర్శించారు. తప్పుడు సర్వేలు, రికార్డుల పేరుతో పేదల పొట్ట కొట్టారన్నారు.300 యూనిట్ల కరెంటు వాడకం ఉంటే పెన్షన్ ఇవ్వబోమని చెప్పడం దుర్మార్గమని శ్రీనివాసరావు అన్నారు. ఓటు వేయలేదని, మరొక పార్టీకి చెందిన వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం సరి కాదన్నారు. అమ్మఒడి లబ్ధిదారులకు కూడా షరతులు పెట్టి 3.5 లక్షల మందికి కోత విధించారని, ట్యాబ్‌ల పంపిణీ పేరుతో మరో 5 లక్షల మందిని తగ్గించారని విమర్శించారు. రేషన్ డిపోలలో సంక్రాంతి సందర్భంగా బియ్యంతోపాటు పండుగ సరుకులు కూడా పంపిణీ చేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## 45 రోజుల్లో.. ఒకే కుటుంబంలో నలుగురు మృతి..



కరీంనగర్, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): ఇది హృదయ విదారక ఘటన. అంతు చిక్కని వ్యాధితో 45 రోజుల్లో ఒకే కుటుంబంలో నలుగురు చనిపోయారు. నెల రోజుల వ్యవధిలో ఇద్దరు చిన్నారులు చనిపోగా, ఆ తర్వాత భార్యాభర్తలిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన కరీంనగర్ జిల్లాలోని గంగధార మండల కేంద్రంలో వెలుగు చూసింది.

వివరాల్లోకి వెళ్తే.. వేముల శ్రీకాంత్(34), మమతకు కొన్నేండ్ల క్రితం వివాహమైంది. వీరికి అమూల్య(5), అద్వైత్(20 నెలలు) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీకాంత్ వృత్తిరీత్యా ఓ ప్రయివేటు కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. అయితే నవంబర్ నెలలో అద్వైత్‌కు జ్వరం వచ్చింది. దీంతో పాటు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆ బాబు కోలుకోలేకపోవడంతో.. హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ నవంబర్ 16న అద్వైత్ ప్రాణాలు కోల్పోయాడు.

అద్వైత్ మాదిరిగానే అమూల్య కూడా తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆ పాప కూడా నవంబర్ 29న ప్రాణాలు కోల్పోయింది. ఇద్దరు పిల్లలు తన కళ్ల ముందే చనిపోవడంతో తల్లి మమత డిసెంబర్ 15న తీవ్ర అనారోగ్యానికి గురైంది. భార్య మమతను బతికించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశాడు. కానీ ఆమె కూడా డిసెంబర్ 17న చనిపోయింది. ఇద్దరు పిల్లలతో పాటు భార్య కూడా మృతి చెందడంతో శ్రీకాంత్ కూడా తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ఆయన కూడా అనారోగ్యానికి గురై.. శుక్రవారం రాత్రి ప్రాణాలు విడిచాడు.

### నలుగురి మృతికి కారణాలు ఏంటి..?

45 రోజుల్లోనే ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. వీరి మృతికి గల కచ్చిత కారణం తెలియరాలేదు. గంగధార పీహెచ్‌సీ డాక్టర్లు.. శ్రీకాంత్ ఇంటిని పరిశీలించారు. శ్రీకాంత్ తల్లిదండ్రుల రక్త నమూనాలను సేకరించారు. ఇంట్లోని నీటిని కూడా పరీక్షించారు. వాటర్ ఎలాంటి కలుషితం కాలేదని వైద్య పరీక్షల్లో తేలింది. ఇక మమత నమూనాలను కూడా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. నలుగురి మృతికి గల కారణాలు ఫోరెన్సిక్ రిపోర్టులోనే తేలే అవకాశం ఉందన్నారు.

## ఇంటలిజెన్స్ ఓఎస్‌డిగా శివకుమార్ .. ఉత్తర్వులు జారీ చేసిన సిఎస్

అమరావతి: డిసెంబర్ 31:ఇంటలిజెన్స్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ గా ఐపీఎస్ అధికారి వి.శివకుమార్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు శాఖలో మూడు దశాబ్దాల పాటు పలు హోదాల్లో పనిచేసిన శివకుమార్ నేడు పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం శివకుమార్ సేవలు ఇంటలిజెన్స్ లో ఉపయోగించుకోవాలని రెండేళ్ల పాటు ఓఎస్ డి గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## కర్ణాటకలోని మాండ్యలో మెగా డెయిరీని కేంద్ర ప్రారంభించిన హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా




న్యూఢిల్లీ, డిసెంబర్ 31:కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఈరోజు కర్ణాటకలోని మాండ్యాలో మెగా డెయిరీని ప్రారంభించారు. మాండ్యలోని శ్రీ ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠం 72వ పీఠాధిపతి నిర్మలానందనాథ మహాస్వామీజీ, కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ బసవరాజ్ బొమ్మై, మాజీ ప్రధాని శ్రీ హెచ్‌డి దేవెగౌడ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాతృమూర్తి మృతికి సంతాపం తెలుపుతూ, శ్రీ అమిత్ షా ఆమెకు నివాళులు అర్పించారు మరియు ఈ దుఃఖ సమయంలో దేశం మొత్తం ప్రధానమంత్రికి అండగా నిలుస్తోందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలోని రైతులు వ్యవసాయ మంత్రిత్వ శాఖ నుంచి విడిగా సహకార మంత్రిత్వ శాఖ కావాలని డిమాండ్ చేశారని కేంద్ర హోం, సహకార మంత్రి తెలిపారు. ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి రైతుల అభివృద్ధికి బాటలు వేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. మాండ్య మెగా డెయిరీ ప్రారంభోత్సవ వేదిక నుంచి సహకార సంఘాలకు ఎలాంటి అన్యాయం జరగకూడదనేది భారత ప్రభుత్వ నిర్ణయమని దేశవ్యాప్తంగా ఉన్న సహకార కార్మికులకు చెప్పాలనుకుంటున్నట్లు శ్రీ షా తెలిపారు.

రూ.260 కోట్లతో నేడు ప్రారంభించిన మెగా డెయిరీ రోజుకు 10 లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ చేస్తుందని, అలాగే దీని సామర్థ్యం రోజుకు 14 లక్షల లీటర్ల వరకు పెంచే అవకాశం ఉందని కేంద్ర సహకార మంత్రి తెలిపారు. 10 లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ చేస్తే లక్షలాది మంది రైతుల ఇళ్లకు సంపద చేరుతుందని అన్నారు. కర్ణాటకలో సహకార డెయిరీ బాగా పనిచేస్తోందని శ్రీ షా అన్నారు. నేడు కర్ణాటకలో 15,210 గ్రామ స్థాయి సహకార డెయిరీలు ఉన్నాయి, వీటి ద్వారా రోజుకు సుమారు 26.22 లక్షల మంది రైతులు తమ పాలను పంపిణీ చేస్తారు. 16 జిల్లా స్థాయి డెయిరీల ద్వారా ప్రతిరోజూ 26 లక్షల మంది రైతుల ఖాతాలలో 28 కోట్ల రూపాయలు జమ చేయబడ్డాయి.

1975లో కర్ణాటకలో రోజుకు దాదాపు 66,000 కిలోల పాలను ప్రాసెస్ చేసేవారని, ఈరోజు 82 లక్షల కిలోల పాలను ప్రాసెస్ చేస్తున్నారని, మొత్తం టర్నోవర్‌లో 80% రైతుకే దక్కుతుందని శ్రీ అమిత్ షా చెప్పారు. గుజరాత్‌లో వచ్చిన శ్వేత విప్లవం రైతుల అదృష్టాన్ని మార్చివేసిందని, అమూల్ ద్వారా ఏటా దాదాపు 36 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లోకి 60,000 కోట్ల రూపాయలు జమ అవుతున్నాయని కేంద్ర సహకార మంత్రి తెలిపారు. కర్ణాటకలోని ప్రతి గ్రామంలోనూ ప్రాథమిక డెయిరీలను నెలకొల్పేందుకు అమూల్, నందిని కలిసి పనిచేస్తామని, వచ్చే మూడేళ్లలో కర్ణాటకలో ప్రాథమిక డెయిరీ లేకుండా ఒక్క గ్రామం కూడా ఉండదని కర్ణాటక రైతు సోదర సోదరీమణులందరికీ హామీ ఇస్తున్నట్లు చెప్పారు. జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డిడిబి) మరియు సహకార మంత్రిత్వ శాఖ రాబోయే మూడేళ్లలో దేశంలోని ప్రతి పంచాయతీలో ప్రాథమిక డెయిరీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీనికి సంబంధించి పూర్తి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని శ్రీ అమిత్ షా చెప్పారు. దీంతో మూడేళ్లలో దేశవ్యాప్తంగా గ్రామస్థాయిలో రెండు లక్షల ప్రాథమిక డెయిరీలను ఏర్పాటు చేస్తామని, వీటి ద్వారా దేశంలోని రైతులను శ్వేత విప్లవంతో అనుసంధానం చేసి పాల రంగంలో పెద్ద ఎగుమతిదారుగా భారత్ ఆవిర్భవించనుందన్నారు.

కర్నాటక మిల్క్ ఫెడరేషన్‌కు సాంకేతిక సహకారం, సహకార రంగం మద్దతు మరియు అమూల్ నుండి మొత్తం కార్యాచరణ మద్దతు అందించబడుతుందని మరియు దాని అవసరాలన్నింటినీ సహకార మంత్రిత్వ శాఖ పరిష్కరిస్తుందని కేంద్ర హోం మరియు సహకార మంత్రి చెప్పారు. గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలు కలిసి దేశంలోని మొత్తం పాల ఉత్పత్తి రైతుల సంక్షేమానికి కృషి చేస్తాయని చెప్పారు. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై నేతృత్వంలోని కర్నాటక ప్రభుత్వం పాల ఉత్పత్తి చేసే రైతులకు నేరుగా నగదు బదిలీ ద్వారా లీటరుకు రూ. 5 చొప్పున నేరుగా బ్యాంకు ఖాతాలకు రూ. 1,250 కోట్లు జమ చేయడం పట్ల కేంద్ర సహకార మంత్రి ప్రశంసించారు. శ్రీ అమిత్ షా మాట్లాడుతూ శ్రీ బొమ్మై నేతృత్వంలోని ప్రభుత్వం పాల ఉత్పత్తిచేసే రైతుల ఖాతాలకు డీబీటీ ద్వారా ఏటా రూ. 1,250 కోట్లు బదిలీ చేసింది, క్షీర భాగ్య పథకం ద్వారా చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తొలగించేందుకు 51 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 65 లక్షల మంది పిల్లలకు, 64 వేల అంగన్‌వాడీల్లో 39 లక్షల మంది పిల్లలకు పాలు అందిస్తున్నది.మండ్య జిల్లాలోని రైతులందరికీ డెయిరీ ద్వారా ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేసినందుకు మండ్య పాల ఉత్పత్తిదారుల కమిటీ చైర్మన్ కు శ్రీ అమిత్ షా అభినందనలు తెలిపారు.

## ఆధార్‌ను నిర్భయంగా ఉపయోగించండి-యూఐడిఏఐ

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:ప్రయోజనాలు మరియు సేవలను పొందేందుకు మీ ఎంపిక ప్రకారం ఆధార్‌ను నమ్మకంగా ఉపయోగించండి, అయితే బ్యాంక్ ఖాతా, పాన్ లేదా పాస్‌పోర్ట్‌తో సహా ఇతర గుర్తింపు పత్రాల మాదిరిగానే అదే స్థాయి అప్రమత్తంగా ఉండండి.

ఆధార్ అనేది నివాసితుల డిజిటల్ ఐడీ మరియు ఇది దేశవ్యాప్తంగా నివాసితుల కోసం ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ గుర్తింపు ధృవీకరణకు ఒకే మూలంగా పని చేస్తుంది. నివాసితులు తమ ఆధార్ నంబర్‌ను ఎలక్ట్రానిక్‌గా లేదా ఆఫ్‌లైన్ ధృవీకరణ ద్వారా తమ గుర్తింపు ఆధారాలను ధృవీకరించడానికి మరియు నిర్ధారించడానికి ఉపయోగించవచ్చు.

మొబైల్ నంబర్, బ్యాంక్ ఖాతా నంబర్ లేదా పాస్‌పోర్ట్, ఓటర్ ఐడి, పాన్, రేషన్ కార్డ్ మొదలైన గుర్తింపు పత్రాన్ని పంచుకునే సమయంలో ఏ స్థాయిలో అయితే జాగ్రత్తలు తీసుకుంటామో ఏదైనా సంస్థతో ఆధార్‌ను పంచుకునేటప్పుడు అదే స్థాయి జాగ్రత్తలు పాటించాలి.

పౌరులు తమ ఆధార్ నంబర్‌ను ఇతరులతో పంచుకోవద్దని భావిస్తే యూఐడిఏఐ వర్చువల్ ఐడెంటిఫైయర్ (విఐడీ)ని రూపొందించే సౌకర్యాన్ని అందిస్తుంది. అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించడం ద్వారా లేదా మైఆధార్ పోర్టల్ ద్వారా సులభంగా విఐడీని రూపొందించవచ్చు. ఆధార్ నంబర్ స్థానంలో ప్రామాణీకరణ కోసం దాన్ని ఉపయోగించవచ్చు. క్యాలెండర్ రోజు ముగిసిన తర్వాత ఈ విఐడీని మార్చవచ్చు.

యూఐడిఏఐ ఆధార్ లాకింగ్ మరియు బయోమెట్రిక్ లాకింగ్ సౌకర్యాన్ని కూడా అందిస్తుంది. ఎవరైనా పౌరుడు కొంత కాలం పాటు ఆధార్‌ను ఉపయోగించే అవకాశం లేకుంటే అతను లేదా ఆమె అటువంటి సమయ వ్యవధికి ఆధార్ లేదా బయోమెట్రిక్‌లను లాక్ చేయవచ్చు. అదే సమయంలో మరియు అవసరమైనప్పుడు సౌకర్యవంతంగా మరియు తక్షణమే అన్‌లాక్ చేయవచ్చు.

ఆధార్ నంబర్ హోల్డర్‌కు సురక్షితమైన, మృదువైన మరియు వేగవంతమైన ప్రామాణీకరణ అనుభవాన్ని నిర్ధారించడానికి యూఐడిఏఐ సాంకేతికంగా అధునాతన పర్యావరణ వ్యవస్థను అందిస్తుంది. ఆధార్ చట్టంలోని వివిధ నిబంధనలు మరియు దాని నియమాలు నివాసితుల నుండి ఆధార్ నంబర్‌ను తీసుకునే సంస్థలు సురక్షితమైన మరియు చట్టబద్ధంగా అనుమతించబడిన పద్ధతిలో ఉపయోగించాలని మరియు నిల్వ చేయాలని ఆదేశించాయి.

ఆధార్‌ను కోరే సంస్థలు సమ్మతిని పొందవలసి ఉంటుంది, ఇది ఏ ఉద్దేశ్యం కోసం తీసుకోబడుతుందో పేర్కొనాలి. దయచేసి దాని కోసం పట్టుబట్టాలని యూఐడిఏఐ పౌరులను కోరుతుంది.

పౌరులు యూఐడిఏఐ వెబ్‌సైట్ లేదా ఎం-ఆధార్ యాప్‌లో గత ఆరు నెలల ఆధార్ ప్రమాణీకరణ చరిత్రను తనిఖీ చేయవచ్చు. అలాగే యూఐడిఏఐ ప్రతి ప్రమాణీకరణ గురించి ఇమెయిల్ ద్వారా తెలియజేస్తుంది. అందువల్ల ఇమెయిల్ ఐడిని ఆధార్‌తో లింక్ చేయడం వలన పౌరులు తమ ఆధార్ నంబర్ ప్రామాణీకరించబడిన ప్రతిసారీ సమాచారం పొందినట్లు నిర్ధారిస్తుంది.

ఓటీపీ ఆధారిత ఆధార్ ప్రమాణీకరణతో అనేక సేవలను పొందవచ్చు మరియు మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో అప్‌డేట్ చేయడం ప్రయోజనకరమైన చర్య.

యూఐడిఏఐ నివాసితులు ఆధార్ లేఖ లేదా పివిసీ కార్డ్ లేదా దాని కాపీని గమనించకుండా వదిలివేయవద్దని కోరింది. నివాసితులు పబ్లిక్ డొమైన్‌లో ముఖ్యంగా సోషల్ మీడియా మరియు ఇతర పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌లలో ఆధార్‌ను బహిరంగంగా పంచుకోవద్దని సూచించారు. ఆధార్ హోల్డర్లు ఏ అనధికార సంస్థకు ఆధార్ ఓటీపీని బహిర్గతం చేయకూడదు మరియు ఎవరితోనూ ఎం-ఆధార్ పిన్‌ని పంచుకోకూడదు.ఆధార్‌ని ఎవరైనా అనుమానాస్పదంగా ఉపయోగించినా లేదా ఏదైనా ఇతర ఆధార్ సంబంధిత ప్రశ్న కోసం ఆధార్ హోల్డర్‌లు యూఐడిఏఐకు సంబంధించిన టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ 1947లో సంప్రదించవచ్చు, ఇది 24Î7 అందుబాటులో ఉంటుంది మరియు/లేదా help@uidai.gov.in లో ఇమెయిల్ చేయవచ్చు

## వైకుంఠ ఏకాదశికి భద్రతపరమైన ఏర్పాట్లు.. క్యూలైన్లను పరిశీలించిన డీఐజీ



తిరుపతి, డిసెంబర్ 31:వైకుంఠ ఏకాదశికి భద్రతపరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని అనంతపురం రేంజ్ డీఐజీ రవి ప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన తిరుపతి నగరంలో 9 ప్రాంతాల్లో వైకుంఠ ఏకాదశికి టోకెన్‌ల జారీకి ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భక్తులు సహనం పాటించాలని, ప్రతి ఒక్క భక్తునికి దర్శనం చేసుకునే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం వారు వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారన్నారు.. ఏకాదశి. ద్వాదశి రోజుతో పాటు పది రోజులు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా అశేష భక్తి జనం సమూహాన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నగరంలో 9 ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక టోకన్లు జారీ చేయు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. క్యూ లైన్ లో తోపులాట జరగకుండా రద్దీని నియంత్రించడానికి తగిన పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

## బొకేలు, శాలువాలు బదులు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయండి : మంత్రి కొప్పుల



జగిత్యాల, డిసెంబర్ 31:నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకల సందర్భంగా తనను కలిసే వ్యక్తులు బొకేలు, శాలువాల బదులు పేద విద్యార్థులకు పనికివచ్చే సామాగ్రి పంపిణీ చేయాలని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు తన విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.కొనుగోలు చేసే బొకేలు, శాలువలు, ఫ్లెక్సీలకు బదులుగా స్కూల్ విద్యార్థులకు పనికి వచ్చే పుస్తకాలు, పెన్నులను, స్కూల్ బ్యాగులను పంపిణీ చేయాలని సూచించారు. జిల్లా గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పలువురు ధన్యవాదాలు తెలిపారు. శనివారం కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంపెల్లి హనుమాండ్లు, సర్పంచ్ పావని నగేశ్, పార్టీ మాజీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, పలువురు నాయకులు మర్యాదపూర్వంగా కలిశారు.

## ఇంద్రకీలాద్రికి రూ. 7.50 కోట్లు ఆదాయం

అమరావతి: డిసెంబర్ 31: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై భవాని దీక్షల విరమణ సందర్భంగా ఆలయానికి రూ. 7.50 కోట్లు ఆదాయం వచ్చిందని ఈవో భ్రమరాంబ తెలిపారు. డిసెంబర్ 15 నుంచి 19వ తేదీ వరకు భవాని దీక్షల విరమణ జరిగిందన్నారు. భక్తుల సౌకర్యార్థం రూ. 100లు,రూ.300 లు, రూ. 500ల టికెట్లను అందుబాటులో ఉంచామని వివరించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన విరమణ సందర్భంగా 5 లక్షల 40 వేల మంది భవానీలు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు.

15 లక్షల లడ్డులు అమ్ముడు అయ్యాయని వెల్లడించారు. వచ్చే ఏడాది దసరా, దీక్షలకు పర్మినేట్ హోమ గుండాలు ఏర్పాటు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వచ్చే ఉత్సవాలకు ముందస్తుగా కొన్ని పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

## అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ అరెస్ట్

వరంగల్ డిసెంబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ అరెస్ట్ అయ్యాడు. నేడు వరంగల్‌లో అతడు పోలీసులకు పట్టుబడ్డాడు. అయ్యప్పస్వామిపై బైరి నరేష్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో అయ్యప్పస్వాములతో పాటు పలువురు తీవ్ర కోపోద్రిక్తులయ్యారు. నడిరోడ్డుపై బైరి నరేష్ అనుచరుడు శంకర్‌పై దాడి చేశారు. నరేష్ వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా అయ్యప్ప భక్తుల ధర్నాలకు దిగారు. బైరి నరేష్‌పై పలు చోట్ల కేసులు సైతం నమోదయ్యాయి. దీంతో అతనిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి బైరి నరేష్ కోసం గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు నేడు వరంగల్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు.

## వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ సీనియర్ నేత నక్కా ఆనందబాబు నిప్పులు

అమరావతి డిసెంబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు నిప్పులు చెరిగారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ పై ఫైరయ్యారు. "కందుకూరు విషాద ఘటనపై మానవత్వం ఉన్నవారంతా అయ్యోపాపం అన్నారు. వైసీపీ నేతలు (ఆ పార్టీ పేటీఎమ్ బ్యాచ్ మాత్రం దుష్టప్రచారంతో వికృతానందం పొందుతోంది. జగన్ రెడ్డి ఆదేశాలతోనే కందుకూరు ఘటనపై విష ప్రచారం చేస్తూ శునకానందం పొందుతున్నారు. నర్సీపట్నం సభలో ముఖ్యమంత్రి మాటలు విన్నాక.. ఆయన తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని అర్థమైంది. ప్రభుత్వ, పోలీస్ వైఫల్యం వల్ల జరిగిన దుర్ఘటనను జగన్ రెడ్డి సిగ్గులేకుండా రాజకీయం చేస్తున్నారు. జనాల్ని కూడా సాంకేతిక పరిజ్ఞానంతో సృష్టించడం నీకు, నీ సాక్షి మీడియాకే తెలుసు జగన్ రెడ్డి. నీకులాగా పార్ట్ టైమ్ పాదయాత్రలు చేయడం, ప్రజల్ని గ్రాఫిక్స్‌లో చూపడం మాకు, మా పార్టీకి తెలియదు. చంద్రబాబు సభలకు వస్తున్న జన సునామీలు చూసి నీకు వెర్రిపట్టింది. అదే జన సునామీ జగన్ సర్కార్‌ని ముంచెత్తే రోజు దగ్గర్లోనే ఉంది. నీకున్న ప్రచారపిచ్చి దేశంలో ఎవరికీ ఉండదు జగన్ రెడ్డి. జాతీయ నాయకుల పేర్లు కూడా తీసేసి.. పథకాలకు నీ పేర్లే పెట్టావు. జాతీయ చిహ్నాలు, పిల్లలు తినే కోడిగుడ్లు, స్కూల్ బ్యాగులు షూలపై కూడా నీ పార్టీ రంగులేయించావు. ప్రభుత్వ ప్రకటనల్లో ఒక్కమంత్రి ఫొటో కనపడదు.. నీ ఫొటో తప్ప. రైతుల పాస్ పుస్తకాల పై నీ బొమ్మలేంటి జగన్ రెడ్డి. అది నీ ప్రచారపిచ్చికాదా? నీ సభలకు జనాన్ని రప్పించడానికి వాలంటీర్లు వైసీపీ నేతల్ని వాడుకుంటున్నావు. వచ్చిన అరకొర జనాన్ని పారిపోకుండా చూడటానికి పోలీసుల్ని అడ్డంపెట్టుకుంటున్నావు. నీ ప్రచారపిచ్చి, నీ చేతగాని విధానాలతో నీ పార్టీ ఎమ్మెల్యే లే విసుగెత్తిపోయారు." అని నక్కా ఆనందబాబు ధ్వజమెత్తారు.

## రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పువ్వాడ



ఖమ్మం, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): నూతన సంవత్సరం-2023 పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖ, సంతోషాలతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ప్రశాంతంగా జీవితం గడపాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరి జీవితాలలో కొత్త వెలుగులు రావాలని, ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నానని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ ఈ నూతన సంవత్సరంలో మరిన్ని విజయాలు సాధిస్తుంది అని ఆకాంక్షించారు. రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగుతోందని, బంగారు తెలంగాణగా అడుగులు వేస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కి ఆ భగవంతుడు 2023-నూతన ఏడాది మరింత శక్తిని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు. పుష్కలంగా వర్షాలు కురిసినందున పాడిపంటలకు సమృద్ధిగా నీరు అందుబాటులో ఉన్నదని, ప్రజలు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడానికి ఆలోచించాలని, రైతులు మంచి దిగుబడులు పొందాలనికోర ుకుంటున్నామన్నారు.

కొత్త సంవత్సరంలో అందరూ బాగుండాలని, ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించాలని ఆశిస్తున్నామని తెలిపారు.

## న్యూ ఇయర్ జోష్, ప్రపంచ వ్యాప్తంగా వేడుకలు.. తొలుత ఓషినియాలో ప్రారంభం

హైదరాబాద్, డిసెంబర్ 31ప్రపంచ వ్యాప్తంగా న్యూ ఇయర్ సంబరాలు అంబురాన్నంటాయి. 2022కు గుడ్ బై చెప్పి.. 2023 కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం చెప్పారు. అందరికంటే ముందుగా ఓషియానియా న్యూ ఇయర్‌కు స్వాగతం చెప్పేసింది.

ప్రపంచంలోని కొత్త సంవత్సరం ముందుగా ఓషినియాలో ప్రారంభమైంది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకే అక్కడ న్యూ ఇయర్ ప్రారంభమైంది. చిన్న పసిఫిక్ ద్వీప దేశాలు టోంగా, కిరిబాటి, సమోవాలు కొత్త ఏడాదికి స్వాగతం పలికాయి. ఇక, న్యూజిలాండ్ కూడా కొత్త ఏడాదికి స్వాగతం పలికింది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4.30గంటలకు న్యూజిలాండ్ కొత్త ఏడాదిని స్వాగతించింది.

ఆనందోత్సాహాల మధ్య కివీస్ ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీప కాంతుల వెలుగుల్లో ఆక్లాండ్ నగరం మెరిసిపోయింది. బాణసంచా వెలుగులతో స్కైటవర్ వర్ణ రంజితమైంది. ప్రపంచ వ్యాప్తంగా వేడుకలు జరుపుకున్నారు. గత రెండేళ్లుగా కొవిడ్ కారణంగా చాలా దేశాలలోని పరిమితంగానే న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. అయితే ప్రస్తుతం చాలా దేశాల్లో కరోనా ప్రభావం పెద్దగా లేదు. దీంతో రెండేళ్ల తర్వాత గ్రాండ్‌గా న్యూ ఇయర్ సెలబ్రేట్ చేసుకున్నారు.

## మహా శివరాత్రి జాతరను సక్సెస్ చేద్దాం

### -ఎస్పీ రాహుల్‌హెగ్డే

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): వేములవాడలో జరిగే మహాశివరాత్రి జాతరను సమష్టిగా విజయవంతం చేద్దామని కలెక్టర్ అనురాగ్ జయం తి సూచించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా వేడుక ఏర్పాట్లను చేయాలని, సమన్వయంతో అధికారులు పనిచేస్తేనే ఇది సక్సెస్ అవుతుందని కలెక్టర్ చెప్పారు. గతం కంటే భక్తులు అధికంగా వచ్చే అవకాశముందని, ఈ నేపథ్యంలో గతం కంటే మెరుగ్గా మహాశివరాత్రి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మహాశివరాత్రి జాతర జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై శుక్రవారం వేములవాడ ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో వివిధశాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్లు బీ సత్యప్రసాద్, ఎన్ ఖీమ్యానాయక్, ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ట్రా న్స్‌పోర్టు, పార్కింగ్, రోడ్ల మరమ్మతులు, అకామిడేషన్, తాగునీరు, విద్యుత్ సరఫరా, బం దోబస్తు పార్కింగ్, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, క్యూ లైన్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్రెస్ సిస్టం ఏర్పా టు, శివార్చన కార్యక్రమం సూచికల ఏర్పాట్లు, ప్రచారం, అనుబంధ ఆలయాల్లో ఏర్పాట్లు తదితర అంశాలపై కార్యాచరణ ప్రణాళికను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రతి శాఖ క్షేత్రస్థాయిలో అమలుచేసే సమగ్ర కార్యాచరణను సిద్ధం చేసుకొని వచ్చే సమావేశంలో వివరించాలని చెప్పారు. పారిశుద్ధ్యం ప్రాధాన్యతను గుర్తించి మ్యాన్ పవర్, వాహనాలను పెంచుకోవాలని చెప్పారు. మరిన్ని ఎక్కువగా టాయిలెట్, డ్రెస్ చేంజింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసి సిబ్బంది నిరంతరం ఉండేలా చూసుకోవాలని చెప్పారు. తాగునీరు, శానిటేషన్ టాయిలెట్ ప్లాన్, స్టాఫ్ ప్లాన్, మెటీరియల్ ప్లాన్‌లను ఆయా శాఖల అధికారులు సిద్ధం చేసి అదనపు కలెక్టర్‌కు అందజేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉండే రూ ట్లలో అదనపు బస్ సర్వీసులను నడపాలని ఆదేశించారు. రోడ్ల మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. టెంపుల్‌తో పాటు అన్ని ముఖ్య ప్రదేశాలను ఆ ధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా విద్యుత్ దీ పాలతో అందంగా అలంకరించాలన్నారు. ఆయా శాఖల అధికారులు వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాల న్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్‌జయంతి మాట్లాడుతూ ఫిబ్రవరిలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు పెద్ద సంఖ్యలో భక్తుల హాజరై అవకాశమున్న దృష్ట్యా అందుకు అనుగుణంగా ఏర్పా ట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రధానంగా పారిశు ద్ధ్యం, పార్కింగ్, క్యూలైను, తాగునీరు సరఫరా మెనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వచ్చే సమావేశంలో అన్ని ప్రభుత్వశాఖలు తమకు అప్పగించిన బాధ్యతలు, చేయబోయే కార్యచరణను వివరిస్తూ సూక్ష్మ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తేవాలని ఆదేశించామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే మాట్లాడుతూ శివరాత్రి జాతరకు జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రా ఫిక్, పార్కింగ్, క్యూలైను ధర్మగుండం కంట్రోల్‌రూమ్, బ్యారికేడింగ్ మేనేజ్‌మెంట్‌ను పకడ్బందీగా చేస్తామన్నారు. గతం కంటే అధికంగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూ స్తామన్నారు. సమావేశంలో ఆదనపు కలెక్టర్ ఖీ మ్యానాయక్, సత్యప్రసాద్, వేములవాడ ఆర్డీ వో పవన్‌కుమార్, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, జిల్లా రవాణాధికారి కొండల్‌రావు, డీపీవో రవీందర్, ప్యాకేజీ-9 కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఉ న్నారు.

## సార్వత్రిక ఆరోగ్య రక్షణ రంగంలో మరో మైలు రాయి అధిగమించిన భారతదేశం

## పనిచేయడం ప్రారంభించిన 1,50,000 ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు




న్యూఢిల్లీ, డిసెంబర్ 31:దేశ ప్రజలందరికి వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని సాగుతున్న ప్రయత్నాల్లో భారతదేశం మరో ముందడుగు వేసింది. ఆరోగ్య మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసేందుకు దేశం అన్ని ప్రాంతాల్లో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా ఏర్పాటైన 1,50,000 పైగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు 2022 డిసెంబర్ 31 నాటికి పని చేయడం ప్రారంభించాయి. గడువుకు ముందుగా లక్ష్యాన్ని చేరుకోవడం పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. లక్ష్య సాధనలో సహకరించిన వారిని ప్రధానమంత్రి అభినందించారు. దేశంలో అన్ని ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలను అందుబాటులోకి తెస్తాయని అన్నారు.

నిర్ణయించుకున్న లక్ష్యాన్ని దేశం సాధించిందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రకటించారు. లక్ష్య సాధనకు సహకరించిన ప్రతి ఒక్కరినీ మంత్రి అభినందించారు. ప్రజలందరికి ఆరోగ్య సంరక్షణ అందించాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కల సాకారం అవుతుందని అన్నారు. రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వం కలిసి సంయుక్తంగా పనిచేయడం వల్ల ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించే అంశంలో ప్రపంచానికి భారతదేశం మార్గదర్శకంగా నిలిచింది అని డాక్టర్ మాండవీయ అన్నారు.

ఎవరిని విస్మరించకుండా ప్రతి ఒక్కరికి సహకారం అందించాలి అన్న అంత్యోదయ స్ఫూర్తితో దేశంలో ఏర్పాటైన 1,50,000 ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు ప్రజలందరికీ ఆరోగ్య సేవలను అందుబాటులోకి తెచ్చాయి. అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు పుట్టినప్పటి నుండి మరణం వరకు సమగ్ర నిరంతర ఆరోగ్య సంరక్షణ అందించడానికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి. వివిధ కార్యక్రమాల ద్వారా దేశంలో మారుమూల ప్రాంతాలకు ఆరోగ్య సేవలు విస్తరించడానికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు ద్వారా కృషి జరుగుతోంది. టెలీ సంప్రదింపుల రంగంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు సరికొత్త రికార్డు సృష్టించాయి. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు 8.5 కోట్లకు పైగా టెలీ సంప్రదింపులు అందించాయి. ఈ- సంజీవని ద్వారా రోజుకు సరాసరిన దాదాపు 4 లక్షల టెలీ సంప్రదింపులు జరుగుతున్నాయి.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాల ద్వారా దేశంలో 134 కోట్ల మంది ప్రజలు ప్రయోజనం పొందారు. వివిధ వ్యాధుల నిర్ధారణ కోసం 86.90 మందికి పరీక్షలు నిర్వహించారు. 29.95 కోట్ల హైపర్‌టెన్షన్, 25.56 కోట్ల మధుమేహం, 17.44 కోట్ల క్యాన్సర్, 17.44 కోట్ల రొమ్ము క్యాన్సర్, 5.66 కోట్ల గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయడం జరిగింది.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలను నెలకొల్పడం వల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు- హెల్త్ వెల్ నెస్ కేంద్రాల్లో 172 రకాల అత్యవసర ఔషదాలు అందుబాటులోకి వచ్చాయి. అదేవిధంగా ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు- హెల్త్ వెల్ నెస్ కేంద్రాల్లో లభిస్తున్న అత్యవసర ఔషదాల సంఖ్య 105 కి చేరింది. 63 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు- హెల్త్ వెల్ నెస్ కేంద్రాల్లో 63 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు- హెల్త్ వెల్ నెస్ కేంద్రాల్లో 14 రకాల పరీక్షలు జరుగుతున్నాయి. యోగా, జుంబా, సైక్లాథాన్‌లు, వాకథాన్‌లపై ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు సేవలు అందిస్తున్నాయి. సమాజ శ్రేయస్సు కోసం మనస్తత్వాన్ని అలవరచుకోవడానికి ఆహారం, శారీరక శ్రమ, సానుకూల సంతాన సాఫల్యం, పొగాకు, మద్యపానం మానడం వంటి ఇతర అంశాలకు సంబంధించిన మార్గదర్శకాలను ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు అందిస్తాయి .

ఇప్పటి వరకు, ఈ కేంద్రాలలో 1.60 కోట్లకు పైగా వెల్‌నెస్ సదస్సులు నిర్వహించబడ్డాయి.

పట్టణ ప్రాంతాల్లో కూడా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెన్ కేంద్రాలు పనిచేయడం ప్రారంభించాయి. 2-3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ వెల్ నెస్ కేంద్రాలను ఒక పరిధిలోకి తీసుకొని వచ్చి మెరుగైన ఔట్ పేషెంట్ సేవలు అందించడం జరుగుతుంది. దీనివల్ల ఒక ఆరోగ్య కేంద్రం పరిధిలో 15,000 నుంచి 20,000 మంది ప్రజలు ప్రయోజనం పొందుతారు.

## మాజీ ఎంపీ పొంగులేటి నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఖమ్మం, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు ఖమ్మం మాజీ ఎంపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రానున్న కొత్త సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాలని, ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరారు. ప్రతి ఒక్కరిలో ఉప్పొంగే ఉత్తేజం, అవధులు లేని ఉ త్సహం ప్రతి ఇంటిలో సంతోషాలు ప్రతి ఒక్కరికి ఆనందం లభించాలని పొంగులేటి ఆకాంక్షించారు.

## ఏపీలో ముందస్తు ఎన్నికలకు ప్రధాని గ్రీన్ సిగ్నల్ ?

అమరావతి డిసెంబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఏపీలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. 175కి 175 సీట్లు సాధించాలనే కృతనిశ్చయంతో వైసీపీ ఉంది. టీడీపీ జనసేన?బీజేపీ సైతం విజయం సాధించాలని ఉవ్విళ్లూరుతున్నాయి. ఈ దిశగా అన్ని పార్టీలు వ్యూహాలు పన్నుతున్నాయి. తమ అస్త్రశస్త్రాలకు పదును పెడుతున్నాయి.మరోవైపు ఏపీలో ముందస్తు ఎన్నికలు వస్తాయని ప్రతిపక్షాలు టీడీపీ జనసేన నమ్ముతున్నాయి. వైసీపీ ప్రభుత్వం పైన ప్రజల్లో అంతకంతకూ వ్యతిరేకత పెరుగుతున్నాయని ఆయా పార్టీలు భావిస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా పూర్తిగా దిగజారిందని.. సంక్షేమ పథకాలను కూడా జగన్ కొనసాగించలేరని అంటున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా 2 లక్షల మందికిపైగా పెన్షన్ లను తొలగిస్తున్నారని చెబుతున్నాయి.తమ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగకముందే ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని వైసీపీ భావిస్తోందని ప్రతిపక్షాలు బలంగా విశ్వసిస్తున్నాయి. వాస్తవానికి 2024 వేసవిలో ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పోలవరం ప్రాజెక్టు రైల్వే జోన్ రాజధాని అంశం ఇలా కీలక అంశాలన్నీ ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉండటంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని ప్రతిపక్షాలు విశ్వసిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జగన్ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లడం ఖాయమని నమ్ముతున్నాయి.తాజాగా సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటనలో ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర హోం మంత్రి అమిత్ షాలతో చర్చించారని అంటున్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్/అక్టోబర్ లో ముందస్తు ఎన్నికలకు వెళ్తామని జగన్ వారికి చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ముందస్తు ఎన్నికల కోసం జగన్ అసెంబ్లీని రద్దు చేసినా ఎప్పుడు ఎన్నికలు నిర్వహించాలనేది కేంద్ర ఎన్నికల సంఘం ఇష్టం.ఈ నేపథ్యంలో కేంద్రం మద్దతు లేకుండా వైఎస్ జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లడం సాధ్యం కాదు. అయితే మొదటి నుంచి అన్నీ విషయాలు తమ మద్దతు అడిగినా అడగకపోయినా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి అన్ని విధాల వైసీపీ మద్దతు ప్రకటిస్తూ వస్తోంది. ఈ క్రమంలో ముందస్తు ఎన్నికలకు వెళ్తామని.. ఇందుకు కేంద్రం ఒప్పుకోవాలని.. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జగన్ బీజేపీ పెద్దలను కోరినట్టు ప్రచారం సాగుతోంది.

ఇందుకు బీజేపీ పెద్దలు కూడా అంగీకరించినట్టు సమాచారం. జగన్ కూడా ముందస్తు ఎన్నికల నేపథ్యంలోనే ఆరు నెలల ముందుగానే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్చార్జులను గడప గడపకు పంపుతున్నారు. ఈ కార్యక్రమం జనవరితో పూర్తయిపోతుంది.

మరోవైపు ప్రతి 50 ఇళ్లకు వలంటీర్ల తరహాలో గృహ సారథులను కూడా నియమించుకోవాలని జగన్ తమ పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను నియమించుకుని పార్టీని క్షేత్ర స్థాయి నుంచే బలోపేతం చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గానికి 50 మంది చొప్పున కార్యకర్తలను ఎంపిక చేసి నియోజకవర్గ సమీక్షలను నిర్వహిస్తున్నారు. దీంతో జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలన్నింటినీ చేపడుతున్నారని అంటున్నారు.సీఎం వైఎస్ జగన్ తాజా ఢిల్లీ పర్యటనలో ప్రధాని మోదీ కేంద్ర హోం మంత్రి అమిత్ షాలతో కీలక చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ముందుగా ఏపీ అసెంబ్లీని ఎప్పుడు రద్దు చేయాలి ముందస్తు ఎన్నికలకు ఎప్పుడు వెళ్లాలనే దానిపై చర్చించినట్లు ఢిల్లీ సర్కిల్స్ లో టాక్ నడుస్తోంది.

దీంతో అసెంబ్లీ రద్దుతోపాటు ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకు ప్రధాని మోదీ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా జగన్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఏప్రిల్ తర్వాత ఏపీ అసెంబ్లీ రద్దు చేసేందుకు సీఎం జగన్ కు లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది వేసవిలో బడ్జెట్ ప్రవేశపెడతారని.. ఇందులో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని చెబుతున్నారు. అలాగే పలు కొత్త పథకాలను కూడా ప్రవేశపెడతారని అంటున్నారు. ఆ తర్వాతే ముందస్తు ఎన్నికలకు వెళ్తారని పేర్కొంటున్నారు. ఈ లెక్కన వచ్చే ఏడాది అక్టోబర్ నవంబర్ సమయంలో ముందస్తు ఎన్నికలు ఉంటాయని తెలుస్తోంది.

## బైరి నరేష్ పై పీడి యాక్ట్ బుక్ చేయాలి

### -శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధన కార్య దర్శి ఏ సుదర్శన్ డిమాండ్




హైదరాబాద్ డిసెంబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హిందూ దేవి దేవతలు పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తూ హిందూ మనోభావాలు దెబ్బతీస్తూ ముఖ్యంగా హిందువులను టార్గెట్ చేస్తూ పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తున్న బైరి నరేష్ పై పీడి యాక్ట్ బుక్ చేయాలని శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధన కార్య దర్శి ఏ సుదర్శన్ డిమాండ్ చేసారు.ఈ మేరకు నేడు కాచిగూడ పోలీస్ స్టేషన్ లో కాచిగూడ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ రామ్ లక్ష్మణ్ కు బైరి నరేష్ పైన కంప్లైంట్ ఇచ్చారు.ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ ఇతను చదువుకున్న ఉస్మానియా యూనివర్సిటీలో రద్దు చేస్తూ ఇతన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. ఏ మతాల పైన అనుచిత వ్యాఖ్యలు చేయకూడదని పోలీస్ శాఖ వెంటనే బైరి నరేష్ పైన పీడీ యాక్ట్ బుక్ చేయాలని హిందువుల తరపున శివసేన తరపున డిమాండ్ చేసారూ. ఈ వ్యాఖ్యల వల్ల అయ్యప్ప స్వాములకు అవమానం జరిగింది ఈ బైరి నరేష్ వల్ల తెలంగాణ ప్రభుత్వానికి అవమానమన్నారు.ఈ కార్యక్రమం లో గణేష్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు, వేణుగోపాల్ దానరాజ్ గోపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ఆక్వా రైతాంగం కష్టాల సాగు! పెరిగిన మేత ధరలు- తగ్గిన అమ్మకం ధరలు

అమరావతి: డిసెంబర్ 31: రాష్ట్రంలో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతంలో ఏటా పది లక్షల మెట్రిక్ టన్నులుపైగా దిగుబడి సాగిస్తూ విదేశీ మార్కెట్లో సత్తా చాటిన ఘనచరిత క్రమంగా మసకబారుతోంది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ ప్రోత్సాహలేమి, రొయ్యల మేత ధరల పెరుగుదల, మార్కెట్‌లో ధర లేకపోవడం వంటి వరుస పరిణామాలతో ఆక్వా రంగం నష్టాల బాట పట్టింది. మేత, ప్రొ బయాటిక్స్ అరువు ఇచ్చేది లేదని రైతులకు వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు. రాష్ట్రంలో సుమారు లక్ష ఎకరాల్లో అక్వాసాగు వుండగా వుభయ గోదావరి జిల్లాల్లో దాదాపు 60 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల మందికిపైగా రైతులు ప్రత్యక్షంగా, ప్రాసెసింగ్ యూనిట్లు-, ఎక్స్‌పోర్టర్స్, చిరు వ్యాపారులు మరో లక్ష మందికిపైగా ఈ రంగంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. రొయ్య పిల్లలు, విద్యుత్తు, డీజిల్ వంటి వాటిని రైతులు ముందుగానే నగదు చెల్లించి కొనుగోలు చేస్తుంటారు.

రొయ్యల మేత, ప్రొ బయాటిక్స్, ఇతర మందులను దుకాణాల్లో అరువుకు తెచ్చుకుంటారు. పంట అమ్మిన తరువాత డబ్బులు చెల్లిస్తారు. ప్రస్తుతం ఆక్వా రంగం సంక్షోభంలో ఉండడంతో మేత దుకాణాల వ్యాపారులు ఈ నెల ఒకటి నుంచి అరువు ఇవ్వడం నిలిపేశారు. రాజకీయ పెద్దలు, పెద్ద రైతులకు మాత్రమే అరువు ఇస్తున్నాయి. చిన్న రైతులు పెట్టు-బడి పెట్టే స్తోమత లేక సాగుకు స్వస్తి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. గడిచిన నెల రోజుల్లో పది వేల ఎకరాల్లో పంటను మధ్యలోనే అమ్ముకున్నట్టు- సమాచారం. కొంతమంది రైతులు ఉన్న పంటతోనే సరిపెట్టు-కుని, మళ్లీ పంటకు రొయ్య పిల్లలను వేయడం లేదు. ఏటా ఈ సీజన్‌లో సీడ్ కోసం పెద్ద ఎత్తున ఆర్డర్లు వచ్చేవని, రైతులు సాగుకు ముందుకు రాకపోవటంతో అమ్మకాలు మందగించాయని హేచరీల నిర్వాహకులు చెబుతున్నారు.

గతంలో వంద కౌంట్ రొయ్యల ధర కిలో రూ.220 వరకూ పలికేది. ప్రస్తుతం రూ.150 నుంచి రూ.160 ఉంది. ప్రభుత్వం ఇటీవల మంత్రులతో కమిటీ వేసి వంద కౌంట్‌కు కిలో ఒక్కంటికి రూ.230 ధర చెల్లించాలని నిర్ణయించింది. వ్యాపారులు, ప్రాసెసింగ్ యూనిట్లు సిండికేట్‌గా మారడంతో ఈ ధర అమలు కావట్లేదు. ఎకరా రొయ్యల సాగుకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ ఖర్చవుతోంది. గత నెల రోజులుగా రొయ్యలు కొనేందుకు ఎగుమతిదారులు ముందుకు రావట్లేదని, వ్యాపారులు అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆక్వా రంగం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ రంగం పట్ల ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించి నష్టాల నుంచి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. వంద శాతం ఫారిన్ ఎక్స్ఛేంజ్‌కి అవకాశం ఉన్న ఆక్వా రంగం అభివృద్ధికి చొరవ చూపాలి. వంద కౌంట్ కేజీకి పెట్టు-బడి ఖర్చు రూ.300 అవుతోంది. మార్కెట్ ధర రూ.150 మించడం లేదు. ఎగుమతిదారుల తీరుపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరం. ఫీడ్ ధరలను అదుపు చేయాలి. మంచి సీడ్ అందించే విధంగా చర్యలు చేపట్టాలి. కరోనా వైరస్ విజృంభణ అనంతరం నెలకొన్న పరిస్థితుల నుంచి ఇప్పటికీ ఆక్వా రైతులు కోలుకోలేదు.

## స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఘనంగా నూతన సంవత్సర వేడుక




ఖమ్మం, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను చిన్నారులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శు భాకాంక్షలు తెలియజేస్తూ, సంతోషాన్ని వ్యక్తపరిచాం

ు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రాంగణం అంతా ఆనంద ఉత్సాహాల మధ్య కేకులు కట్ చేస్తూ కేకులు తినిపించుకుంటూ చిన్నారులు ఒకరికొకరు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ కేరింతలు కొట్టారు. గత సంవత్సరం అనుభూతులను స్మరించుకుంటూ నూతన సంవత్సరానికి శుభాకాంక్షలు అందజేస్తూ అదేవిధంగా నూతన సంవత్సరానికి "స్వాగతం" పలుకుతూ రాబోయే సంవత్సరంలో తమ భవిష్యత్తు మంచి ఉండాలని అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని "సరస్వతి" కటాక్షం తమపై ఉండాలని ప్రత్యేకమైన ప్రార్థనలు చేశారు. తమ చదువులు ప్రశాంతంగా కొనసాగాలని సరస్వతి కటాక్షం తమపై ఉండాలని చిన్నారులు పాఠశాల ప్రాంగణంలో కేకులు కట్ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ, నూతన సంవత్సరం అందరికీ కలిసి రావాలని కరోనా మహమ్మారి భూతం వల్ల విద్యారంగంపై తీవ్రమైన ప్రభావం చూపిందని అలాంటి మహమ్మారి మళ్ళీ దరి చేరకుండా ఆ భగవంతుని ఆశీస్సులతో నూతన సంవత్సరం సజావుగా సాగాలని, చదువుల తల్లి సరస్వతి దేవి చల్లని దీవెనలు ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అందరికీ మేలు జరగాలని, పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు అందరూ కలిసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింత నిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ ఎస్. హరీష్...

మెదక్, డిసెంబర్ 31 నేటినిజం (ప్రతినిధి):2023 నూతన సంవత్సరంప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని, ఆనందోత్సవాల మధ్య వేడుకలు ఘనంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ .హరీష్ ఆకాంక్షించారు.2023 ఆంగ్ల నూతన సంవత్సరంలో ప్రజలు సరికొత్త ఆలోచనలు,ఆశలు,ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఎన్నో ప్రభుత్వ ఉద్యోగ ప్రకటనలు పడ్డాయని, నిరుద్యోగ యువత జీవితంలో స్థిరపడుటకు చక్కటి అవకాశమని, కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని హితవు చెప్పారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని కోరుకుంటూ జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం

మెదక్, డిసెంబర్ 31 నేటినిజం (ప్రతినిధి):గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించవలసినదిగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులకు సూచించారు .శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, గ్రామీణభివృద్ధి, పంచాయితీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టి పారిశుద్యం, పచ్చదనం, చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, గ్రామపంచాయితీలకు ట్రాక్టర్ లను సమకూర్చడం వంటి కార్యక్రమాలు తీసుకోవడం జరిగిందని అన్నారు. గ్రామాలలో చేపట్టిన కార్యక్రమాలపై గ్రామసభలు నిర్వహించి ప్రజలకు వివరించాలని, ముఖ్య కూడళ్లు, గ్రామపంచాయితీ ముందు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన బోర్డు లను ఏర్పాటు చేయాలనీ అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జిల్లా, మండల పంచాయితీ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆ గ్రామాలలో ఫించన్ దారులకు అందిస్తున్న ఆసరా ఫించన్ ల సంఖ్య నెల నెలా అందిస్తున్న డబ్బుతో పాటు రైతు బంధు, రైతు భీమా, కెసిఆర్ కిట్, మిషన్ భగీరథ, పంచాయితీ భవనాల నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ వంటి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను కూడా బోర్డు లపై నమోదు చేయాలనీ సూచించారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయితీల ట్రాక్టర్ ల ద్వారా పంచాయితీ ఆదాయాలు పెరిగాయని, అట్టి నిధుల మేరకు అవసరమైన పనులు చేసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాలలో నిర్మించిన వైకుంఠధామలను వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. వైకుంఠధామం నకు వెళ్ళడానికి రోడ్లను, ఫెన్సింగ్, నీటి సరఫరా, విద్యుత్, మరుగుదొడ్ల ఏర్పాటు, తదితర మౌళిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పరిషద్ సీఈఓ వెంకట శైలేష్,, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా పంచాయితీ అధికారి రాజేంద్రప్రసాద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# తుది పరిక్షలకు అర్హత సాధించిన 696 మంది అభ్యర్థులు



ఖమ్మం, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్స్, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా శనివారం జరిగిన దేహదారుఢ్య పరిక్షలకు 1184 మంది హాజరైయ్యారని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ తెలిపారు. ఇందులో 696 మంది అభ్యర్థులు తుది పరిక్షలకు అర్హత సాధించారని తెలిపారు. శనివారం మొత్తం 1348 మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 1184 మంది హాజరై ఈవెంట్లలో పాల్గొన్నారని తెలిపారు.

# ఎంపీ రవిచంద్ర, పవన్ కళ్యాణ్‌ల ఆత్మీయ పలకరింపు



ఖమ్మం, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ప్రముఖ సినీ హీరో పవన్ కళ్యాణ్ లు ఆత్మీయంగా పలకరించుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానం మేరకు పలువురు ప్రముఖులు శుక్రవారం మధ్యాహ్నం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రవిచంద్ర, పవన్ కళ్యాణ్ లు ఎదురుపడి ఆత్మీయంగా పలకరించుకున్నారు. కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

# సీఎస్ఆర్ నిధులతో సామాజిక సేవలకు పెద్దపీట

హైదరాబాద్, డిసెంబర్ 31 ప్రైవేటు రంగ సంస్థల నుంచి వస్తున్న సీఎస్ఆర్ నిధులతో పేదలకు మేలు కలిగేలా సామాజికాభివృద్ధి పనులకు పెద్దపీట వేయడం హర్షణీయమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయనగర్‌లో ప్రభుత్వ పాఠశాలలో 8 అదనపు గదుల నిర్మాణానికి దుండిగల్ గ్లాండ్ ఫార్మా సౌజన్యంతో రూ.2 కోట్ల వ్యయాన్ని వెచ్చించారు. ఈ పనులను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, స్థానిక మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీశ్‌తో పాటు సంస్థ ప్రతినిధులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవలో ప్రైవేట్ రంగాల సంస్థలు ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేశ్, పార్టీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు డి. శ్రీనివాస్, సత్తిరెడ్డి, నాయకులు కిశోర్‌చారి, యాదగిరి, బాలయ్య, పెంటయ్య, మధుకర్, వెంకటేశ్, అజయ్, రాముడు కాలనీ అసోషియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

126 డివిజన్ పరిధికి చెందిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆవిష్కరించారు. ఐడీఐ జీడిమెట్ల ఫేస్-4 వద్ద ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సహకారంతో మినీలారీలకు, ఆటో, ట్రాలీ వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయా యూనియన్ల ప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి బస్తీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

గాజులరామారం : ప్రతి బస్తీ, కాలనీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని పోచమ్మ బస్తీలో సుమారు రూ.39 లక్షలతో నూతనంగా నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం బస్తీ వాసులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా ఎన్నికైన బస్తీ సంక్షేమ సంఘం సభ్యులను ఆయన సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

డీఈఈ రూపాదేవి, సీనియర్ నాయకులు మిర్జా రశీద్ బేగ్, కస్తూరి బాల్‌రాజు, ఆబిద్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్‌యాదవ్, సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సంధ్యారెడ్డి, ఉపాధ్యక్షులు రఘునాథ్, వినోద, రమేశ్, ఆంజనేయులు, జనరల్ సెక్రటరీ నవీన్, జాయింట్ సెక్రటరీలు అశోక్, సాయిప్రకాశ్, శ్రీకాంత్, క్యాషియర్ ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్స్ శేఖర్, సయ్యద్ ఫెరోజ్, మునీర్, కార్యవర్గ సభ్యులు జనార్దన్, సుజాత, రాజు, రవి, హేమ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి ప్రయాణం భారం

హైదరాబాద్, డిసెంబర్ 31 సంక్రాంతి పండుగ పేరుతో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక రైళ్ల ద్వారా రైల్వే శాఖ దోపిడీకి సిద్ధమైంది. పండుగ నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రయాణికులకు ప్రయాణం భారంగా మారింది. దీంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రైళ్లలో సాధారణ చార్జీలపై గరిష్ఠంగా 30 శాతం వరకు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కిక్కిరిసి పోతున్న రైళ్లలో చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలతో ప్రయాణాలు చేయలేక, అదనపు చార్జీలు చెల్లించలేక పలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈ క్రమంలో కావాలనే దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తున్నారని, కాని ప్రత్యేక రైళ్లలో సాధారణ చార్జీలు ఎందుకు వసూలు చేయడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్ర యాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బోగీలు ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తులను రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.దక్షిణ మధ్య రైల్వే జోన్ జనరల్ మేనేజర్ ప్రకటించిన వివరాల ప్రకారం సంక్రాంతి నేపథ్యంలో జనవరి 1 నుంచి 20 వరకు 94 రైలు సర్వీసులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రైల్వే అధికారులు తెలిపారు. పైగా ప్రయాణికుల అదనపు సౌకర్యం కోసం ప్రత్యేక రైలు సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, వికారాబాద్ నుంచి నర్సాపూర్, మచిలీపట్నం, కాకినాడ వైపుగా అధిక సంఖ్యలో రైళ్లను నడుపుతున్నట్లు వివరించారు.

# ప్రాథమిక స్థాయిలోనే బలమైన పునాదులు కల్పించాలి : మంత్రి నిరంజన్‌రెడ్డి



వనపర్తి, డిసెంబర్ 31: ప్రాథమిక స్థాయిలోనే బలమైన పునాదులు ఉంటే విద్యార్థులు అన్ని రంగాల్లో దూసుకెళ్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల అవగాహన, సంగ్రహణ శక్తిని బట్టి ఉపాధ్యాయుల బోధన ఉండాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని గోపాల్ పేట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు రేవల్లి, గోపాల్ పేట మండలాల స్థాయి బోధనాభ్యసన సామాగ్రి మేళాను మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతరం అధ్యయనం చేయాలని, విద్యార్థులకు విషయం నేరుగా అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు.ఎప్పటికప్పుడూ టీచింగ్, లర్నింగ్ టెక్నిక్ లను అందిపుచ్చుకోవాలని కోరారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారి మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యాశాఖలో తొలిమెట్టు కార్యక్రమం అభినందనీయమని,ఇంటర్, డిగ్రీ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు.

ఉన్నత చదువులు చదివిన వారిలో కూడా ప్రాథమిక అంశాల మీద అవగాహన ఉండడం లేదని అన్నారు. ప్రతి పదివేల మందికి సగటున 44 మంది వైద్యులు ఉండాలని,ఈ సగటున అమెరికాలో కూడా వైద్యులు లేరని పేర్కొన్నారు. భవిష్యత్ లో ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణ లో కార్యక్రమాలు జరుగబోతున్నాయని వెల్లడించారు.

# భారతీయ జనతా పార్టీని తాను గురువు గా భావిస్తా

## -వారే తనకు ఒక మార్గాన్ని చూపించారు

## -కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ డిసెంబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భారతీయ జనతా పార్టీని తాను గురువు గా భావిస్తానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. వారే తనకు ఒక మార్గాన్ని చూపించారని, ఏమి చేయకూడదో తనకు ఎప్పటికప్పుడు చెబుతుంటారని అన్నారు.

శనివారంనాడిక్కడ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, బీజేపీ తన మీద మరిన్ని తీవ్ర ఆరోపణలు చేయాలని కోరుకుంటున్నానని, అందువల్ల వారి భావజాలం ఏమిటో తాను అర్థం చేసుకునేందుకు ఉపయోగపడుతుందని అన్నారు.కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ తాను యాత్ర ప్రారంభించినప్పుడు ఇదొక సాధారణ యాత్రగానే తాను తీసుకున్నానని, కానీ ఈ యాత్రకి ఎన్నో స్వరాలు, అనుభవాలు ఉన్నాయని మెల్లమెల్లగా అర్థం చేసుకున్నానని చెప్పారు. ఇందుకు గాను బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని చెప్పారు. వారు ఎంత ఎక్కువగా టార్గెట్ చేస్తే, అంతే స్థాయిలో కానీ మరో రూపంలో కానీ తమకు మేలు చేసినట్టని అన్నారు. భారత్ జోడో యాత్రలో పాల్గొనేందుకు ప్రతి ఒక్కరికి అవకాశం ఉందన్నారు. తమతో కలవాలని వచ్చే ఎవరినీ అడ్డుకోమని స్పష్టం చేశారు. అఖిలేష్, మాయావతి, ఇతరులు ప్రేమపూర్వక హిందుస్థాన్ కావాలనుకుంటున్నారని, భావజాలం విషయంలో తమ మధ్య సాన్నిహిత్యం ఉందని రాహుల్ తెలిపారు.

# బొకేలు,శాలువాలు వద్దు..

## - నోట్ బుక్స్,స్టేషనరీ ఇవ్వండి

## - అంగన్ వాడి పిల్లలకు మ్యాట్ లు ఇవ్వండి..మీ గ్రామాల్లో,మీ వార్డుల్లో పాఠశాలలను దత్తత తీసుకోండి

## - వృధా ఖర్చుల స్థానంలో ఒక మంచి పనికి ముందుకు రండి

## - మీరు చేసే చిన్న సహాయం భవిష్యత్తు తరాలకు వెలుగులు నింపేదిగా మారుతుంది

## - రానున్న నూతన సంవత్సరానికి ఒక కొత్త నిర్ణయం తీసుకోండి

## - ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రజలకు మంత్రి పువ్వాడ విజ్ఞప్తి

ఖమ్మం, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): నూతన సంవత్సరం-2023 సందర్భంగా తనను కలువటానికి వచ్చే వారు ఎవరు కూడా బొకేలు, శాలువలు తీసుకురావొద్దని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విజ్ఞప్తి చేసారు.

ఇతర నేతలను, అధికారులను కలువటానికి వెళ్ళేటప్పుడు కూడా ఇదే విధంగా ముందుకు వెళ్లాలని కోరారు. అలాంటి వృధా ఖర్చుల స్థానంలో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

వాటి స్థానంలో విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, బ్యాగులు, వాటర్ బాటిల్స్, పెన్నులు, పెన్సిళ్లు, అంగన్ వాడి పిల్లలకు మ్యాట్లు, చిన్న వాటర్ బాటిళ్లు, ఇతరత్రా వాటిని అందించాలని కోరారు. రానున్న నూతన సంవత్సరము 2023 సందర్భంగా అందరూ ఒక కొత్త నిర్ణయం తీసుకొని,అమలు చేయాలని కోరారు. నూతన సంవత్సరంతో పాటుగా జన్మదినాల సందర్భంగా ఇలాంటి సమాజ హిత కార్యక్రమం చేపట్టడం ద్వారా పేద,మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా కూడా ఇదే విధానాన్ని పాటించాలని కోరారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు ఈ దిశగా రానున్న జనవరి ఒకటో తేదీ నుండి ఈ నిర్ణయాన్ని అమలు చేసి జిల్లాలో ఓ సరికొత్త విధానానికి నాంది పలుకలన్నారు..



నాయకులు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని ఆయా పాఠశాలల అభివృద్ధి లో భాగస్వాములు కావాలని కోరారు.

# కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ



ఖమ్మం, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం లింగగూడెం గ్రామం రైతు వేదిక (బస్వాపురం)నందు 82 కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్,10 సీఎంఆర్ ఎఫ్ చెక్కులను వైరా ఏమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ వారి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ దొండపాటి లక్ష్మి, మండల జడ్పిటిసి పోట్ల కవిత, ఎంపీపీ గోసు మధు, మండల పార్టీ అధ్యక్షుడు వై. చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శి పరికపల్లి శ్రీనివాస్, జిల్లా బిఆర్ఎస్ నాయకులు పోట్ల శ్రీనివాసరావు, వైరా ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, సుడా డైరెక్టర్ బండారు కృష్ణ, ఆప్షన్ నెంబర్ మౌలానా, సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, మండల ఎస్టీ సెల్ అధ్యక్ష కార్యదర్శులు సురేష్, భూక్యా నరసింహానాయక్, ఎస్సీ సెల్ కార్యదర్శి అద్దంకి చిరంజీవి, బీసీసెల్ రచ్చ రామకోటయ్య, యువత అధ్యక్షులు వత్త్యా రంగ, సర్పంచుల సంఘం అధ్యక్షులు చల్లా మోహన్ రావు, ఎంపిటీసీలు, సర్పంచులు, నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# చాక్నవాడి నాలా అభివృద్ధికి రూ. కోటి 27 లక్షలు మంజూరు

హైదరాబాద్, డిసెంబర్ 31 గోషామహల్‌లోని చాక్నావాడి ప్రాంతంలో నాలా పైకప్పు కుంగిపోయిన విషయం తెలిసిందే. ఈ నాలా అభివృద్ధి పనులకు రూ. కోటి 27 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. నాలా అభివృద్ధి పనులు రెండు, మూడు రోజుల్లో ప్రారంభం అవుతాయని మంత్రి స్పష్టం చేశారు. నాలాను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నాలాలపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు. అక్రమ నిర్మాణాలపై దందా చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను మంత్రి తలసాని ఆదేశించారు.

గత శుక్రవారం గోషామహల్‌లోని చాక్నావాడి ప్రాంతంలో నాలా పైకప్పు కుంగిపోయింది. అక్కడ పార్కింగ్ చేసిన వాహనాలు నాలాలో పడి ధ్వంసమయ్యాయి. బైక్‌లు, ఆటోలు, కార్లు, వారాంతపు సంతకు తీసుకువచ్చిన తోపుడు బండ్లు నాలాలో పడిపోయాయి. వారాంతపు సంత కూరగాయలు, ఇతరత్రా సామగ్రి నాలాలో పడిపోయాయి. ఈ ప్రమాదంలో ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. అఫ్జల్‌సాగర్ నుంచి మొదలైన నాలా ఆగాపుర, దారుసలాం, గోషామహల్, చాక్నావాడి, గోషామహల్ బరాదరి మీదుగా తోప్‌ఖానా, ఉస్మాన్‌గంజ్, కిషన్‌గంజ్, గౌలిగూడల నుంచి ఎంజీబీఎస్ మీదుగా మూసీలోకి చేరుతుంది.



# అయ్యప్ప స్వామిని దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): అయ్యప్ప స్వామిని దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విహెచ్ పి కార్యకర్తలు, బిజెపి నాయకులు అయ్యప్ప స్వామి భక్తులు శనివారం వేములవాడ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం నుండి కోరుట్ల బస్టాండ్ వరకు ర్యాలీ ని బైక్ ర్యాలీ నిర్వహించారు.

హిందూ దేవతలను దూషించిన వ్యక్తిపై పిడి యాక్ట్,కేసులు పెట్టాలని అనంతరం టౌన్ సిఐ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రేగుల మల్లికార్జున్, సంటి మహేష్, విశ్వహిందూ పరిషత్ నాయకులు గడప కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# జనవరిలో శ్రీవారి సన్నిధిలో జరిగే విశేష పర్వదినాలు ఇవే..

తిరుపతి, డిసెంబర్ 31: తిరుమల పుణ్యక్షేత్రంలో జనవరి నెలలో జరిగే విశేష పర్వదినాలను టీటీడీ వెల్లడించింది. జనవరి 2 నుంచి 11వ తేదీవరకు వైకుంఠద్వార దర్శనం, జనవరి 2న శ్రీవారి స్వర్ణ రథోత్సవం, 3న స్వామి పుష్కరిణి తీర్థ ముక్కోటి, శ్రీవారి చక్రస్నానం వైభవంగా జరుపనున్నట్లు తెలిపారు. 7న శ్రీవారి ఆలయంలో ప్రణయకలహ మహోత్సవం, 7 నుంచి 13 వరకు ఆండాళ్ నీరాటోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

16న తిరుమలనంబి సన్నిధికి వేంచేపు, శ్రీ గోదాపరిణయోత్సవం, 28న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజున తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం వచ్చే టైంస్లాట్ సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు కృష్ణతేజ విశ్రాంతి గృహం వద్ద, రూ.300 ల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు గల భక్తులు ఏటీసీ సర్కిల్ వద్ద, శ్రీవాణి టికెట్లు గల భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 మెయిన్ గేట్ వద్ద రిపోర్టు చేసేలా ఏర్పాట్లు చేయాలని అదనపు ఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు.

# ఏపీలో పలువురు ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు

అమరావతి డిసెంబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏపీలో పలువురు ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1993 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు ఐపీఎస్ అధికారులకు డీజీపీ ర్యాంకులు ప్రకటించింది. మహేశ్ దీక్షిత్, అమిత్‌గార్గ్, పీ.వీ సునీల్‌కుమార్‌కు డీజీపీ హోదా కల్పించింది. ప్రస్తుతం మహేశ్ దీక్షిత్, అమిత్‌గార్గ్ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు.మహేశ్ చంద్ర లడ్హాకు ఏడీజీగా పదోన్నతి కల్పించారు. శ్యామ్ సుందర్, త్రివిక్రమ వర్మ, పాలరాజుకు ఐజీలుగా, కోయ ప్రవీణ్, భాస్కర్ భూషణ్, అమ్మిరెడ్డికి డీఐజీలుగా పదోన్నతులు కల్పించారు. దీపికా పాటిల్, కృష్ణారావు, అమిత్ బర్దార్‌కు జూనియర్ అడ్మినిస్ట్రేటీవ్ గ్రేడ్‌గా పదోన్నతులు కల్పించారు.

# ఎస్ఎన్‌డీపీ పనులు త్వరగా పూర్తి చేయాలి

హైదరాబాద్, డిసెంబర్ 31 ఎస్ఎన్‌డీపీ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం మంత్రి మల్లారెడ్డి, ఎస్ఎన్‌డీపీ అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పీర్జాదిగూడ, బోడుప్పల్ కార్పొరేషన్ల పరిధిలో శాశ్వత ముంపు సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.110 కోట్లు మంజూరు చేసిందన్నారు. నిధులు మంజూరైనందున పనులను త్వరగా పూర్తి చేసి ముంపు సమస్యను పరిష్కరించాలన్నారు.

సంబంధిత అధికారులు పనులను తరచూ పర్యవేక్షించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో మేయర్లు జక్క వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఎస్ఎన్‌డీపీ డీఈ పవన్, వాటర్ వర్క్ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు


తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ

ఎం.వి.ఆర్. ఫౌండేషన్ & కవన వేదికల

ఆహ్వానం

డా॥ నందివాడ రత్నశ్రీ స్మారక పురస్కారాల ప్రదాన సభ

తేది : 06-01-2023 శుక్రవారం సా॥ 5-30 గంటలకు

వేదిక : రవీంద్రభారతి సమావేశ మందిరం, మొదటి అంతస్తు, హైదరాబాద్

అధ్యక్షులు : డా॥ ఎల్.వి. సుధీర్‌కుమార్, ఐ.ఎ. & ఎ.ఎస్. విశ్రాంత ప్రధాన మహాగణకులు

ముఖ్య అతిథి : ఆచార్య జయధీర్ తిరుమలరావు, సుప్రసిద్ధ రచయిత

గౌరవ అతిథులు : శ్రీ జూలూరి గౌరీశంకర్, అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమీ

శ్రీ మామిడి హరికృష్ణ, సంచాలకులు, తెలంగాణ భాషాసాంస్కృతికశాఖ

ఆచార్య డేనియల్ నెగర్స్, తెలుగు ఆచార్యులు, ఫ్రాన్స్

అవార్డు ప్రదాత : శ్రీ నందివాడ భీమారావు, ఐ.ఎ. & ఎ.ఎస్. విశ్రాంత ప్రధాన మహాగణకులు

వక్తలు : శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి, డిప్యూటి డైరెక్టర్ (చిత్రవాణి)

శ్రీ చీకోలు సుందరయ్య, సీనియర్ పాత్రికేయులు

పురస్కార స్వీకర్తలు : డా॥ గడ్డం మోహన్‌రావు & డా॥ తాళ్ళపల్లి యాకమ్మ

అందరికీ ఇదే మా ఆహ్వానం

మట్టిగుంట వెంకటరమణ, అధ్యక్షులు, ఎం.వి.ఆర్. ఫౌండేషన్

రఘుశ్రీ, అధ్యక్షులు, కవన వేదిక

# నిరుపేదలకు అండగా నిలుస్తున్న గోలి మోహన్



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): నిరుపేదలకు అండగా నిలిచి మరోసారి తన గొప్ప మనసును ఆద్యగోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్ చాటుకున్నారని వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి సర్పంచ్ పెంద్యాల తిరుపతి అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో ఇటీవల నిరుపేద కుటుంబానికి చెందిన నర్సయ్యమరణించగా, మృతుని కుటుంబానికి అధ్యగోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్ 10,000 రూపాయలు ఆర్థిక సాయంతో పాటు 50కిలోల రైస్ బ్యాగ్, వంట సామాగ్రిని సర్పంచ్ పెంద్యాల తిరుపతి చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, అలాగే నిరుపేదపకు అండగా వుంటూ, నేనున్నా అనే భరోసా చైర్మన్ గోలి మోహన్ కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలు ఇలాగే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆద్య గోలి ఫౌండేషన్ సభ్యుడు దేవయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు..

# కుష్టువ్యాధి గ్రస్తులకు సేవలు చేయడం ఎంతో గొప్ప

హైదరాబాద్, డిసెంబర్ 31కుష్టువ్యాధి రోగులకు వైద్య సిబ్బంది అందించే సేవలు ఎంతో గొప్పవని అదనపు కలెక్టర్ మియాంక్ మి ట్టల్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పదహారు మంది కుష్టువ్యాధి రోగులకు ఒక నెల సరిపడే పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమాన్ని పట్టణంలోని జిల్లా దవాఖానలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. సమాజంలో కుష్టువ్యాధి రోగులను గుర్తించే ప్రక్రియ, వారిని దవాఖాన వరకు తీసుకొచ్చి, మంచి మందులతో వైద్యం అందించే మూడు పద్ధతుల్లో సేవలు అందించే ఫీల్ సిబ్బంది, వైద్యులు పాత్ర గొప్పదన్నారు. రోగులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఎనిమిది రకాల ఆహారపు కిట్లను అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు.

డీఎంహెచ్‌వో రామ్‌మనోహరరావు మాట్లాడు తూ గతంలో మాదిరిగా కాకుండా కుష్టు వ్యాధిగ్రస్తులు మందులు వాడుతూ అందరితో కలిసి మెలిసి ఉండవచ్చన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ దాతల సహాయంతో కుష్టు వ్యాధిగ్రస్తు లకు కిట్లను అందించడం జరుగుతుందన్నారు. రూ.900ల విలువ చేసే కిట్‌లో ఎనిమిది రకాల వస్తువులు ఉంటాయన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్, డాక్టర్లు పావని, బా లాజీ, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు జయంత్‌రెడ్డి, సుభాష్, టీబీ ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు తది తరులు పాల్గొన్నారు.

# ఉత్సహాంగా...ఉల్లాసంగా ఆల్ఫోర్స్లో ఘనంగా ముందస్తూ నూతన సంవత్సర వేడుకలు

కరీంనగర్, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): నూతన సంవత్సరం అనగానే ఒక జోష్ అని మరియు సంతోషాన్ని రెట్టింపు చేసేదని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా? వి. నరేందర్ రెడ్డి గారు స్థానిక అల్ఫోర్స్ పాఠశాలల్లో మరియు కళాశాలల్లో వేడుకుగా నిర్వహించిన ముందస్తూ నూతన సంవత్సర వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల చాలా అవగాహన కల్పించాలని మరియు వాటి పట్ల ఆసక్తి కనబరిచే విధంగా ప్రోత్సాహకాలను అందించాలని తద్వారా వారు అందులో పట్టు సాధిస్తారని తెలుపుతూ ముందస్తు నూతన సంవత్సర వేడుకలను సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి చదువుల తల్లి జ్ఞానసరస్వతి మాత విగ్రహానికి పూలమాల వేసి విద్యార్థుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా ప్రారంభించారు. అనంతరం వారు ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసినటువంటి నూతన సంవత్సర కేకును కట్ చేసారు.




మన దేశచరిత్ర విభిన్న కళలకు విశిష్టమైనదని గుర్తుచేస్తూ మనదేశంలో ఉన్నటువంటి కళలు సాంప్రదాయాలు మరేదేశంలో అవలంబించరని చెప్పారు. విద్యార్థులకు వార్షిక ప్రణాళికలో భాగంగా వివిధ కళా నైపుణ్య కార్యక్రమాలను దశల వారిగా నిర్వహిస్తున్నామని మరియు ప్రోత్సాహకాలను అందిస్తున్నామని తెలియజేశారు. విద్యార్థులకు వారాంతపు వినోద కార్యక్రమాలను సైతం నిర్వహిస్తూ వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడంలో సఫలీకృతులం అవుతున్నామని హర్షం వ్యక్తం చేసారు.

2022లో ఆల్ఫోర్స్ విద్యా సంస్థలు అన్ని విభాగాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించి కార్పోరేట్ విద్య సంస్థలకు ధీటుగా వివిధ ప్రణాళికలను రుపాదించి ప్రణాళికబద్ధంగా విద్యార్థుల్లో దాగి ఉన్నటువంటి ప్రతిభను సృజనాత్మకతను వెలికితీయడానికై తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కృషి చేసారని మరియు వారికి కావలసినటువంటి వనరులను కల్పించి అద్భుతాలు సృష్టించామని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామని తెలుపుతూ ప్రతి విద్యార్థి లక్ష్యంవైపు అడుగులు వేయాలని కోరారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంప్రదాయ నృత్యాలు, నాటికలు, పాడిన పాటలు మరియు వినోదాత్మక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షనగా నిలిచాయి. విద్యార్థులు చేసిన మిమిక్రి అద్యంతం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న వాణి విద్యాలయం ఉపాధ్యాయులు...



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణానికి చెందిన వాణి విద్యాలయ ఉపాధ్యాయులు తోటి ఉపాధ్యాయుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం 23 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని రాకేష్ కుటుంబ సభ్యులకు వాణి విద్యాలయం కరస్పాండెంట్లు అనంతరెడ్డి, పిల్లి మహేష్, ప్రిన్సిపాల్ రంగు శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాకేష్ సోదరి అఖిల, ఆయన మాతృమూర్తి త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు. తోటి ఉపాధ్యాయుడు ఆపదలో ఉన్నాడని తెలుసుకొని తోటి ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం అందించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఆపద సమయంలో ఒకరికొకరు తోడు ఉండి తోటి వారిని ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు రాము, మనోజ్ బాబు, శేఖర్, వేణు ,బాబు రాజకుమార్, భారతి, స్రవంతి, రజిత, శృతి, మానస, కవిత, అనూష, సౌమ్య, మయూరి, స్వప్న తోపాటు తదితరులు పాల్గొన్నారు.


# మానవత్వం చాటుకున్న వాణి విద్యాలయం ఉపాధ్యాయులు...





రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణానికి చెందిన వాణి విద్యాలయ ఉపాధ్యాయులు తోటి ఉపాధ్యాయుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం 23 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని రాకేష్ కుటుంబ సభ్యులకు వాణి విద్యాలయం కరస్పాండెంట్లు అనంతరెడ్డి, పిల్లి మహేష్, ప్రిన్సిపాల్ రంగు శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాకేష్ సోదరి అఖిల, ఆయన మాతృమూర్తి త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు. తోటి ఉపాధ్యాయుడు ఆపదలో ఉన్నాడని తెలుసుకొని తోటి ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం అందించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఆపద సమయంలో ఒకరికొకరు తోడు ఉండి తోటి వారిని ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు రాము, మనోజ్ బాబు, శేఖర్, వేణు ,బాబు రాజకుమార్, భారతి, స్రవంతి, రజిత, శృతి, మానస, కవిత, అనూష, సౌమ్య, మయూరి, స్వప్న తోపాటు తదితరులు పాల్గొన్నారు.


# అక్రమ మద్యం విక్రయాలపై పోలీసుల రైడ్.. దాడి చేసిన గ్రామస్తులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: అక్రమంగా మద్యం తయారు చేసి విక్రయిస్తున్న వారిపై పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది రైడ్ చేశారు. అయితే గ్రామస్తులు వారిని ప్రతిఘటించి ఎదురుదాడి చేశారు. దీంతో పలువురు పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లోని కబీర్‌ధామ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సింఘన్‌పురి పోలీస్ స్టేషన్ పరిధిలోని నవ్‌గావ్ గ్రామంలో అక్రమంగా మద్యం తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసేందుకు పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది గురువారం అక్కడకు వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రెచ్చిపోయారు. పోలీసులు, ఎక్సైజ్ సిబ్బందిపై కర్రలతో దాడులు చేశారు. ఊహించని ఈ సంఘటనకు పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది షాక్ అయ్యారు. కొందరు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించారు. గ్రామస్తుల దాడిలో పలువురు గాయపడ్డారు. వారిని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కాగా, నాటుసారా తయారీపై సమాచారం అందుకున్న పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లగా ఈ సంఘటన జరిగింది. నాటు సారా తయారీని అడ్డుకుని వాటిని ధ్వంసం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం చెందారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ఎక్సైజ్ సిబ్బందిపై వారు దాడి చేశారు. ఈ దాడిలో పాల్గొన్న 15 మందికిపైగా గ్రామస్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బందిపై గ్రామస్తుల దాడి వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# ఆ పెద్దపులి ఇకలేదు.. అనారోగ్యంతో మృతిచెందిన కిషన్..!

లక్నో, డిసెంబర్ 31:లక్నోలోని నవాబ్ వాజిద్ అలీ షా జూపార్కులో విషాదం చోటుచేసుకుంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దపులి కిషన్ మృతిచెందింది. ఇవాళ ఉదయం జూ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. హెమాంజియోసర్కోమా అనే ఒక రకం క్యాన్సర్ బారినపడిన టైగర్ కిషన్.. రోజురోజుకు క్షీణించిపోయి చివరికి ప్రాణాలు విడిచింది.

టైగర్ కిషన్ మనుషులను వేటాడి తింటుండటంతో 2009లో కిషన్‌పూర్ టైగర్ రిజర్వ్ నుంచి తీసుకొచ్చి లక్నో జూలో వేశారు. 2008 నుంచి కొన్ని నెలలపాటు కిషన్ పలువురిని వేటాడి చంపింది. ఆ పెద్దపులిని వేటాడటానికి అటవీ అధికారులు కొన్ని నెలలపాటు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఎట్టకేలకు 2009లో బోనులో చిక్కడంతో లక్నో జూకు తరలించారు.

అప్పటి నుంచి గత 13 ఏండ్లుగా కిషన్ లక్నో జూలోనే ఉంటున్నది. కిషన్ చెవికి, మూతికి సమీపంలో క్యాన్సర్ ఏర్పడటంతో అది అడవి జంతువులను వేటాడే శక్తిని కోల్పోయిందని, అందుకే 2008లో అది జనావాసాల్లో చేరి మ్యాన్ ఈటర్‌గా మారిందని వైద్యాధికారులు తెలిపారు. 2009లో లక్నో జూకు తరలించినప్పటి నుంచి వైద్యచికిత్స అందిస్తూ సంరక్షిస్తుండటంతో 13 ఏండ్లు మనగలిగిందని చెప్పారు.

# టీషర్ట్‌పై కంగారు దేనికి.. చలివేస్తే స్వెట్టర్ గురించి ఆలోచిస్తా: రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:దేశంలో చలి తీవ్రత బాగా పెరిగింది. ఉత్తరాదిలో అయితే పగటి ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్ఠస్థాయికి పడిపోయాయి. జనం చలికి గజగజ వణికిపోతున్నారు. అయినా ఉత్తరాదిలో భారత్ జోడో యాత్ర నిర్వహిస్తున్న రాహుల్‌గాంధీ మాత్రం టీషర్ట్ వేసుకునే తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఇవాళ ఢిల్లీలో ఆయన ప్రెస్ మీట్ ఏర్పాటు చేయగా.. మీడియా ప్రతినిధులు టీషర్ట్ గురించి ప్రస్తావించారు.

దాంతో రాహుల్‌గాంధీ ఫన్నీగా సమాధానం చెప్పారు. నేను టీషర్ట్ వేసుకోవడం గురించి అందరూ ఎందుకు అంతగా కంగారు పడుతున్నారు..? అని ప్రశ్నించారు. చలి గురించి తనకు భయం లేదు కాబట్టి తాను స్వెట్టర్ వేసుకోవడం లేదని చెప్పారు. ఒకవేళ తనకు చలి భరించలేకుండా ఉందనే ఫీలింగ్ కలిగితే.. అప్పుడు స్వెట్టర్ వేసుకోవడం గురించి ఆలోచిస్తానని అన్నారు.

# ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అస్సాంలో 'బిజిలీ ఉత్సవ్' నిర్వహించిన ఆర్ఈసీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 31విద్యుత్ వినియోగదారుల హక్కులు, విద్యుత్ ప్రయోజనాలు మరియు మారుమూల ప్రాంతాల్లో విద్యుద్దీకరణ సమయంలో ఎదుర్కొనే సవాళ్లు అలాగే విద్యుత్తు రాకతో జీవన నాణ్యత ఎలా మెరుగుపడుతుందనే అంశాలు వినియోగ అధికారుల స్పీకర్ సెషన్‌లలో వెలువడ్డాయి.

విద్యుత్ వినియోగదారుల హక్కులు, ఇంధన పొదుపు మరియు విద్యుత్ ప్రయోజనాలు వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు క్విజ్ పోటీలు మరియు నుక్కడ్ నాటక్ నిర్వహించారు.

పోటీల్లో విజేతలకు బహుమతులుగా ఎల్ఈడీ బల్బుల పంపిణీతో కార్యక్రమం ముగిసింది

అస్సాంలో 'బిజిలీ ఉత్సవ్' నిర్వహించిన ఆర్ఈసీ లిమిటెడ్

భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో మహారత్న కంపెనీ అయిన ఆర్ఈసీ లిమిటెడ్ 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా 75 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని అస్సాంలోని బక్సా జిల్లా ఆనందపూర్ మరియు చుట్టుపక్కల గ్రామాలలో 'బిజిలీ ఉత్సవ్'ను నిర్వహించింది. కార్యక్రమంలో బోడోలాండ్ టెరిటోరియల్ కౌన్సిల్ స్పీకర్ శ్రీ కతిరామ్ బోరో, బక్సా అదనపు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ అష్రాఫుల్ అమీన్, ఆనందపూర్ ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ ఖగేంద్రనాథ్ సరనియా, నెహ్రూ అంచాలిక్ హైస్కూల్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీ నాగేన్ చంద్ర దాస్, అస్సాం పవర్ డిస్ట్రిబ్యూషన్ కో. లిమిటెడ్ (ఏపీడీసీఎల్) బక్సా ఏజీఎ (ఆర్ఈ) శ్రీ మానస్జ్యోతి పాఠక్ మరియు గౌహతిలోని ఆర్ఈసీ ప్రాంతీయ కార్యాలయం నుండి అధికారులు ఈ కార్యక్రమానికి విచ్చేశారు.

విద్యుత్ వినియోగదారుల హక్కులు, విద్యుత్ ప్రయోజనాలు మరియు మారుమూల ప్రాంతాల్లో విద్యుద్దీకరణ సమయంలో ఎదురయ్యే సవాళ్లను మరియు విద్యుత్తు అందుబాటులోకి రావడంతో జీవన ప్రమాణాలు ఎలా మెరుగుపడతాయి వంటి అంశాలపై ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు మరియు గౌరవనీయ అతిథులు ప్రసంగించారు. గ్రామాల నుండి లబ్ధిదారులను వేదికపైకి ఆహ్వానించి వారి అనుభవాలు మరియు విద్యుత్ వారి జీవితాలను ఎలా మార్చింది అనే దానిపై అభిప్రాయాలను పంచుకున్నారు.

గ్రామస్తులు, చిన్నారులతో ముచ్చటిస్తూ పలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల హక్కులు, ఇంధన పొదుపు మరియు విద్యుత్ ప్రయోజనాలు వంటి విషయాలపై అవగాహన కల్పించేందుకు నుక్కడ్ నాటక్ కూడా ప్రదర్శించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎల్ ఈడీ బల్బులు, జామెట్రీ బాక్సులను బహుమతులుగా పంపిణీ చేయడంతో కార్యక్రమం ముగిసింది.

ఆర్ఈసీ లిమిటెడ్ గురించి: ఆర్ఈసీ లిమిటెడ్ అనేది భారతదేశం అంతటా పవర్ సెక్టార్ ఫైనాన్సింగ్ మరియు డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించే ఎన్‌బిఎఫ్‌సి. 1969లో స్థాపించబడిన ఆర్ఈసీ లిమిటెడ్ తన కార్యకలాపాల నిర్వహణలో యాభై సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఇది రాష్ట్ర విద్యుత్ బోర్డులు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర/రాష్ట్ర విద్యుత్ వినియోగాలు, స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులు, గ్రామీణ విద్యుత్ సహకార సంఘాలు మరియు ప్రైవేట్ రంగ వినియోగాలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. దీని వ్యాపార కార్యకలాపాలు పూర్తి పవర్ సెక్టార్ వాల్యూ చైన్‌లో జనరేషన్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ మరియు రెన్యూవబుల్ ఎనర్జీతో సహా వివిధ రకాల ప్రాజెక్ట్‌లకు ఫైనాన్సింగ్ అందిస్తుంది. ఆర్ఈసీ నిధులు భారతదేశంలోని ప్రతి నాల్గవ బల్బును ప్రకాశింపజేస్తున్నాయి.

# దేశంలో కొత్తగా 226 మందికి కరోనా వైరస్ నిర్ధారణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: దేశంలో కరోనా వైరస్ కేసుల్లో స్వల్ప హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. తాజాగా నిన్న ఉదయం 8గంటల నుంచి శనివారం ఉదయం 8గంటల వరకు 1,87,983 మందిని పరీక్షించగా 226 కేసులు బయటపడినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 4,46,78,384కి చేరింది. ప్రస్తుతం దేశంలో 3,653 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. గత 24 గంటల్లో ముగ్గురు మృతి చెందగా.. మొత్తం మరణాల సంఖ్య 5,30,702కి చేరింది.

ఇప్పటివరకు నమోదైన మొత్తం పాజిటివ్ కేసుల్లో 0.01 కేసులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయని వెల్లడించింది. రికవరీ రేటు 98.80 శాతంగా, మరణాలు 1.19 శాతంగా ఉన్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 220.10 కోట్ల కరోనా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది.

# నీరు, ఇతర మౌలిక సదుపాయాల రంగాల్లోని అగ్ర సంప్రదింపుల సేవల సంస్థల్లో వ్యాప్‌కోస్‌కు మొదటి ర్యాంక్ ఇచ్చిన ఏడీబీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ సంస్థ అయిన వ్యాప్‌కోస్ గొప్ప ఘనత సాధించింది. వార్షిక సేకరణలపై ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) విడుదల చేసిన నివేదికలో, నీరు ఉ ఇతర మౌలిక సదుపాయాల రంగాల్లోని సంప్రదింపుల సేవల సంస్థల్లో అత్యధికంగా మంజూరైన ఆర్థిక మొత్తంతో వ్యాప్‌కోస్ అగ్రస్థానంలో నిలిచింది.ఫాక్ట్ షీట్-2022 పేరిట ఏడీబీ విడుదల చేసిన మరొక నివేదికలో, సంప్రదింపుల సేవల కాంట్రాక్టుల్లో భారతదేశం నుంచి తొలి 3 సంస్థల్లో వ్యాప్‌కోస్ ఒకటిగా నిలిచింది. విద్యుత్, రవాణా, జలం ఉ ఇతర పట్టణ ప్రాంత మౌలిక సదుపాయాల రంగాల్లో ఏడీబీ రుణం, గ్రాంట్, సాంకేతిక సాయం పొందిన ప్రాజెక్టుల విభాగంలో వ్యాప్‌కోస్ ఈ మైలురాయి అందుకుంది. ఈ విభాగాల్లో ఈ ఘనత సాధించిన ఏకైక భారత ప్రభుత్వ రంగ సంస్థ వ్యాప్‌కోస్.

వార్షిక సేకరణలపై ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) విడుదల చేసిన నివేదికలో, నీరు ఉ ఇతర మౌలిక సదుపాయాల రంగాల్లోని సంప్రదింపుల సేవల సంస్థల్లో అత్యధికంగా మంజూరైన ఆర్థిక మొత్తంతో వ్యాప్‌కోస్ అగ్రస్థానంలో నిలిచింది.

సంప్రదింపుల సేవల కాంట్రాక్టుల్లో భారతదేశం నుంచి తొలి 3 సంస్థల్లో వ్యాప్‌కోస్ ఒకటిగా నిలిచింది. విద్యుత్, రవాణా, జలం ఉ ఇతర పట్టణ ప్రాంత మౌలిక సదుపాయాల రంగాల్లో ఏడీబీ రుణం, గ్రాంట్, సాంకేతిక సాయం పొందిన ప్రాజెక్టుల విభాగంలో వ్యాప్‌కోస్ ఈ మైలురాయి అందుకుంది.

జల వనరులు, విద్యుత్, మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగాల్లో సాంకేతికత ఆధారిత సంప్రదింపుల సంస్థ వ్యాప్‌కోస్ . ఇంజినీరింగ్, సేకరణ, నిర్మాణ (ఈపీసీ) సంస్థగానూ సేవలు అందిస్తోంది.

ఆసియా, ఆఫ్రికా, సీఐఎస్, పసిఫిక్ దీవులు, దక్షిణ అమెరికాలోని 51కి పైగా దేశాల్లో ఈ సంస్థ విజయవంతంగా ప్రాజెక్టులు పూర్తి చేసింది లేదా కొనసాగిస్తోంది.జల వనరులు, విద్యుత్, మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగాల్లో సాంకేతికత ఆధారిత సంప్రదింపుల సంస్థ వ్యాప్‌కోస్ . ఇంజినీరింగ్, సేకరణ, నిర్మాణ (ఈపీసీ) సంస్థగానూ సేవలు అందిస్తోంది.భారతదేశంతో పాటు ఆసియా, ఆఫ్రికా, సీఐఎస్, పసిఫిక్ దీవులు, దక్షిణ అమెరికాలోని 51కి పైగా దేశాల్లో ఈ సంస్థ విజయవంతంగా ప్రాజెక్టులు పూర్తి చేసింది లేదా కొనసాగిస్తోంది.

# గత ఏడాది 42 శాతం ఉంటే ఈ ఏడాది 61% రికవరీ

తిరుపతి, డిసెంబర్ 31 జిల్లాలో ఈ ఏడాది క్రైమ్ రేట్ 10% తగ్గిందని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ప్రైవేట్ హోటల్ నందు ఏర్పాటుచేసిన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ గత ఏడాది 42 శాతం ఉంటే ఈ ఏడాది 61% రికవరీ ఉందన్నారు. గత రెండేళ్లలో జిల్లాలో నేరాలు 22% తగ్గాయి అన్నారు. శ్రీకాళహస్తి కే.ఎల్.ఎం. పిన్ కేర్ సంస్థలో బంగారు తాకట్టు దుకాణం కేసు వేగవంతం చేయడంతో పురోగతి సాధించామని వివరించారు. ఈ ఏడాది సెబ్ . వాళ్లు 37 కేసులు నమోదు చేశారన్నారు. గంజాయి 1174 కిలోల గంజాయి ధ్వంసం చేయడం జరిగిందన్నారు. త్వరలో 3000 కిలోల గంజాయిని ధ్వంసం చేయడం జరుగుతుందన్నారు. గంజాయి విక్రయదారులు పై 16మంది పై పీడీ యాక్ట్ కేసు నమోదు చేశామన్నారు. విశాఖపట్నం జిల్లా నుంచి గంజాయి అక్రమంగా తిరుపతి నగరంలో డంపు చేసి అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. ఇక్కడి నుంచి కర్ణాటక, కేరళ, తమిళనాడుకు ,అక్రమంగా తరలిస్తున్నారు. రూ. 80లక్షలు ప్రాపర్టీ నష్టపోయిన వాళ్లకు72 లక్షల రికవరీ చేశామన్నారు. అలాగే నార్త్ ఇండియా కేంద్రంగా ఎక్కువగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని. 26 గ్రామాలు నాటు సారా రహిత గ్రామాలుగా ప్రకటించామన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి కోడిపందాలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతున్నది అన్నారు. డిసెంబరు 31 తేదీ నగరంలో వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాలు తనిఖీ కార్యక్రమం చేపట్టడం జరుగుతున్నది అన్నారు మద్యం తాగి వాహనాలు నడపడమే కాకుండా ఎటువంటి ఘర్షణలు జరగకుండా నిరంతరం బ్లూ కోర్ట్స్ రక్షక్ సిబ్బంది నిరంతరం తిరుగుతూ ఉంటారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీలు పాల్గొన్నారు.

# 'బస్తీ దవాఖాన'ల్లో మెరుగైన వైద్యం

హైదరాబాద్, డిసెంబర్ 31తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'బస్తీ దవాఖాన'లతో నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటి వరకు మండలానికి, మున్సిపాలిటీకి ఒక్కటి చొప్పున ఉన్న ప్రభుత్వ దవాఖానలను సీఎం కేసీఆర్ ఆలోచనతో ప్రతి బస్తీకి ప్రభుత్వ దవాఖాన అందుబాటులో రావడంతో నిరుపేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందిచండానికి కృషి జరుగుతుంది. పూర్తిగా ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేస్తున్న ఈ బస్తీ దవాఖానలు మంచి ఫలితాలను ఇస్తూ, ప్రజల మన్నలను అందుకుంటున్నాయి. ప్రస్తుతం ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఎన్ఎఫ్‌సీ నగర్, కొండాపూర్‌లలో ఏర్పాటు దశలో ఉండగా, బాలాజీ నగరంలో వైద్య సేవలు అందిస్తుంది.

పోచారం మున్సిపాలిటీలో యనంపేట్, పోచారంలో బస్తీ దవాఖానల భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అన్నోజిగూడ ఆర్‌జికెలో పక్కా నూతన భవనంలో ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నారు. ఈ దవాఖానలలో ఎంబీబీఎస్ వైద్యుడు, స్టాఫ్ నర్స్, అటెండర్ మొత్తం ముగ్గురు విధు లు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రజలకు సాధారణ జబ్బులతో పాటు, దీర్ఘకాలి వ్యాధులను కూడా చికిత్సలు అందిస్తున్నారు. ఉచితంగా మందులను అందజేస్తున్నారు. పెద్ద వ్యాధులను గుర్తించి స్థానిక ఏరియా దవాఖాన, ఉస్మానియా, గాంధీ దవాఖానలకు పంపిస్తున్నారు. ఈ బస్తీ దవాఖానల్లో ప్రతిరోజు 80 నుంచి 100 మంది రోగులు వచ్చి వైద్య సేవలను పొందుతున్నారు. త్వరలో అన్ని బస్తీ దవాఖానల్లో ప్రజల ఆరోగ్యానికి కావాల్సిన అన్ని రకాల పరీక్షలను నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం పరీక్షల కోసం పీహెచ్‌సీలకు, ఏరియా దవాఖానలకు పంపుతున్నామని పేర్కొన్నారు.


Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.